RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY నిజం మా విజన్ 18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:25 TUESDAY,JUNE 23,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :25 మంగళవారం, జూన్ 23, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## బొగ్గు టిప్పర్ ఢీకొని భూపాలపల్లి డీటీఓ వెంకన్న దుర్మరణం

### జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



తెలంగాణ పత్రిక : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ ఉదయం ఒక అత్యంత దారుణమైన రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రభుత్వ విధుల్లో భాగంగా రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి బి. వెంకన్న (45)ను ఒక బొగ్గు టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ మిగతా12లో

## డీటీవో వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

2



2

### రైల్వే మంత్రితో సీఎం రేవంత్, కిషన్ రెడ్డి భేటీ.. హైదరాబాద్ మెట్రోపై కీలక చర్చలు..



2

### తెలంగాణకు రక్షణ రంగం బూస్ట్.. కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ!



2

## డీటీఓ వెంకన్న మృతిపై హరీశ్‌రావు అనుమానాలు!

- తనిఖీలు నిర్వహిస్తుండగా డీటీఓ వెంకన్నను ఢీకొన్న టిప్పర్
- అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన వెంకన్న
- అక్రమాలను అడ్డుకుంటే లారీలతో తక్కించి చంపేస్తారా? అని ప్రశ్నించిన హరీశ్

## జస్ట్ 2 గంటల్లో దుబాయ్‌కి.. విమానం కంటే వేగం..

### ఈ సూపర్ ట్రైన్ గురించి తెలిస్తే అవాక్కే..



తెలంగాణ పత్రిక ప్రతినిధి: ముంబైలో ఉదయం ఇడ్లీ, సాంబార్ తిని.. మధ్యాహ్నానికి దుబాయ్‌లో లంచ్ చేయాలనుకుంటున్నారా? విమానం కంటే వేగంగా, సముద్రం అడుగున ప్రయాణిస్తూ షార్క్‌లు, తిమింగలాలను చూస్తూ దుబాయ్ వెళ్లిపోవాలని ఉందా? వినడానికి ఏదో హాలీవుడ్ గ్రాఫిక్స్ సినిమా కథలా ఉంది అనుకుంటున్నారా.. అయితే మీరు ఈ స్టోరీ చదవాల్సిందే..మౌలిక సదుపాయాల రంగంలో మానవ మేధస్సుకు సవాలు విసిరే సరికొత్త అద్భుతానికి భారత్, యూఏఈ దేశాలు పునాది వేస్తున్నాయి. అరేబియా సముద్ర గర్భంలో, 200 మీటర్ల లోతున.. ముంబై నుంచి దుబాయ్‌ని కలుపుతూ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన అండర్ వాటర్ సొరంగ మార్గం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. డీప్ బ్లూ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచే ఈ సూపర్‌సోనిక్ రైలు ప్రత్యేకతలు తెలిస్తే ఎవరైన అవాక్కవ్వాల్సిందే. ప్రస్తుతం ముంబై నుంచి దుబాయ్‌కి ఫ్లైట్‌లో వెళ్లాలన్నా కనీసం 3 నుండి 4 గంటల సమయం పడుతుంది. కానీ అరేబియా సముద్రం అడుగున దాదాపు 2 వేల కిలోమీటర్ల పొడవునా నిర్మించే ఈ అండర్ వాటర్ సొరంగ మార్గం ద్వారా కేవలం మిగతా2లో



## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన..
- చింతకాని మండలంలో సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లకు అనువైన స్థలాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం..

తెలంగాణ పత్రిక : ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జూన్ 30న నిర్వహించనున్న సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. మిగతా12లో

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి



- ప్రతి జిల్లాకు ఒక మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలుకు యోచన..
- ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ..

తెలంగాణ పత్రిక : రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార - పౌరసంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరి ష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవారం నాడు రెవెన్యూ మిగతా12లో

## రేవంత్ రెడ్డి విజన్‌ను చూసి బావ, బావమరిది జీర్ణించుకోలేకపోతున్నారు



- రేవంత్ రెడ్డి అన్ని రంగాలను గాడిలో పెడుతున్నారన్న చామల
- అధికారంలో ఉన్నన్నాళ్లు సినిమా వాళ్లతో కేటీఆర్ అంటకాగారని విమర్శ
- ఇప్పుడు కూడా సినిమా డైలాగులు చెబుతున్నారని మండిపాటు

తెలంగాణ పత్రిక : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళు తుంటే... దాన్ని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ప్రభు త్వంపై బురదజల్లు తున్నారని భువనగిరి కాం గ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వంటి విప్లవాత్మక మార్పులతో సీఎం రేవంత్ రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను గాడిలో మిగతా12లో



12

## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా

- ఓట్ల దొంగతనంతో పాటు బీజేపీ సీట్ల దొంగతనానికీ పాల్పడుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ
- సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని వెల్లడి

### అమెరికాలో తెలంగాణ విద్యార్థి ఆకస్మిక మృతి

- ఫ్లోరిడాలో ఆకస్మిక అనారోగ్యంతో అరుణ్ సాయిరెడ్డి మృతి
- ఉన్నట్టుండి తీవ్ర అనారోగ్యానికి గురైన సాయిరెడ్డి

### హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన..


వివరాలు12లో

## నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు..

### వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా: కేటీఆర్

- ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కేటీఆర్
- మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ

12



## ప్రజా సంక్షేమంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం

**రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి**



తెలంగాణ పత్రిక : ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.సోమవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సామాజిక భవన నిర్మాణం పనులకు జిల్లా మిగతా12లో

# జస్ట్ 2 గంటల్లో దుబాయ్‌కి.. విమానం కంటే వేగం..



ముంబైలో ఉదయం ఇడ్లీ, సాంబార్ తిని.. మధ్యాహ్నానికి దుబాయ్‌లో లంచ్ చేయాలనుకుంటున్నారా? విమానం కంటే వేగంగా, సముద్రం అడుగున ప్రయాణిస్తూ షార్క్‌లు, తిమింగలాలను చూస్తూ దుబాయ్ వెళ్లిపోవాలని ఉందా? వినడానికి ఏదో హాలీవుడ్ గ్రాఫిక్స్ సినిమా కథలా ఉంది అనుకుంటున్నారా.. అయితే మీరు ఈ స్టోరీ చదవాల్సిందే.. మౌలిక సదుపాయాల రంగంలో మానవ మేధస్సుకు సవాలు విసిరే సరికొత్త అద్భుతానికి భారత్, యూఏఈ దేశాలు పునాది వేస్తున్నాయి. అరేబియా సముద్ర గర్భంలో, 200 మీటర్ల లోతున.. ముంబై నుంచి దుబాయ్‌ని కలుపుతూ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన అండర్ వాటర్ సొరంగ మార్గం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. డీప్ బ్లూ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచే ఈ సూపర్‌సోనిక్ రైలు ప్రత్యేకతలు తెలిస్తే ఎవరైన అవాక్కవ్వాల్సిందే.

ప్రస్తుతం ముంబై నుంచి దుబాయ్‌కి ఫ్లైట్‌లో వెళ్లాలన్నా కనీసం 3 నుండి 4 గంటల సమయం పడుతుంది. కానీ అరేబియా సముద్రం అడుగున దాదాపు 2 వేల కిలోమీటర్ల పొడవునా నిర్మించే ఈ అండర్ వాటర్ సొరంగ మార్గం ద్వారా కేవలం 2 గంటల్లోనే ప్రయాణాన్ని పూర్తి చేయవచ్చు. ఈ మార్గంలో నడిచే రైళ్లు సాధారణమైనవి కావు. ఇవి గంటకు 600 నుండి 1000 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో దూసుకెళ్లే అత్యాధునిక హైపర్‌సోనిక్ లేదా సూపర్‌సోనిక్ సాంకేతికతతో పనిచేస్తాయి.సముద్ర గర్భంలో అద్భుత ప్రయాణం ఈ ప్రాజెక్టులో అత్యంత ఆకర్షణీయమైన, ప్రపంచాన్ని ఆకట్టుకుంటున్న అంశం.. పనోరమిక్ విండోస్. సముద్ర మట్టానికి దాదాపు 200 మీటర్ల లోతులో ఈ సొరంగ మార్గం ఉంటుంది. ఈ బుల్లెట్ రైలు కిటికీలు, గోడలు పారదర్శకమైన అద్దాలతో రూపొందిస్తారు. రైలు అత్యంత వేగంగా దూసుకెళు న్నప్పుడు ప్రయాణికులు కిటికీల గుండా సముద్రగర్భంలోని తిమింగలాలు, షార్క్‌లు, రంగురంగుల చేపలను, సముద్ర జీవులను నేరుగా వీక్షించవచ్చు. ఇది ప్రయాణికులకు ప్రపంచంలోనే అతిపెద్ద అక్వేరియంలో ప్రయాణిస్తున్న ఒక సరికొత్త అనుభూతిని ఇస్తుంది.చమురు, మంచినీటి రవాణా కూడా.. ఈ డీప్ బ్లూ ఎక్స్‌ప్రెస్ సొరంగం కేవలం మనుషుల రవాణాకే పరిమితం కాలేదు. ఇరు దేశాల వ్యూహాత్మక, వాణిజ్య అవసరాలను తీర్చేలా దీనిని డిజైన్ చేస్తున్నారు. యూఏఈ నుంచి భారత్‌కు అవసరమైన ముడి చమురును ఈ సొరంగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే పైప్‌లైన్ల ద్వారా వేగంగా రవాణా చేస్తారు. అదే సమయంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఉండే దుబాయ్‌కి భారత్ నుండి స్వచ్ఛమైన నీటిని ఈ మార్గం ద్వారానే ఎగుమతి చేస్తారు.

# తెలంగాణకు రక్షణ రంగం బూస్ట్.. కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ!

తెలంగాణ పత్రిక ప్రతినిధి

న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. భూ సేకరణ, యుటిలిటీల బదలాయింపు తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రికి హామీ ఇచ్చారు. దేశ భద్రత, రక్షణకు సంబంధించిన ప్రాజెక్టు కావడంతో రాష్ట్రం తరఫున అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామని స్పష్టం చేశారు.భారత వైమానిక దళం విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను భారీ స్థాయిలో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో, ప్రయాణికుల కోసం సివిల్ ఏవియేషన్ టెర్మినల్, కార్గో సదుపాయాలు, మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ కేంద్రాలు, హ్యాంగర్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. దీంతో పాటు అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థలు తమ హ్యాంగర్లను ఏర్పాటు చేసుకునేలా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మధ్యప్రాచ్య ప్రాంతంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత ఎయిర్‌లైన్స్‌కు ప్రత్యామ్నాయ కేంద్రంగా ఆదిలాబాద్ ఎదిగే అవకాశాలు ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు.అలాగే మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్ ప్రతిపాదించిన కీలక రక్షణ ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర రక్షణ మంత్రిని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

# రైల్వే మంత్రితో సీఎం రేవంత్, కిషన్ రెడ్డి భేటీ...

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణకు ఆ ఇద్దరూ కీలక నేతలే. ఒకరు రాష్ట్ర స్థాయిలో.. మరొకరు కేంద్రస్థాయిలో చక్రం తిప్పుతున్నారు. వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు సైతం భిన్న ధృవాల్లాంటివే. అలాంటి నేతలు.. ఇప్పుడు ఒక్కతాటిపైకి వచ్చారా? రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి నడవబోతున్నారా? ఇప్పుడు రాజకీయంగా అదే చర్చ జరుగుతోందిగత కొన్నాళ్లుగా నువ్వానేనా అన్నట్టుగా పరస్పరం మాటల తూటాలు పేల్చుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. ఇప్పుడు రాష్ట్రం కోసం ఒక్కటిగా అడుగులు వేస్తున్నారనే చర్చ మొదలైంది. వీళ్లిద్దరూ ఒక్కటిగా.. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ని కలవడం పొలిటికల్‌గా చర్చనీయాంశమవుతోంది. రాష్ట్రం నుంచి కేంద్రమంత్రిగా ఉంటూ.. మెట్రో రైల్ విస్తరణకు సహకరించడం లేదంటూ.. కొన్ని రోజులుగా కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ.. విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు సీఎం రేవంత్. కేంద్రం నుంచి ప్రాజెక్టులు రాకుండా.. కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారంటూ.. తీవ్ర వ్యాఖ్యలు కూడా చేశారు. దానికి కిషన్‌రెడ్డి సహా బీజేపీ కీలక నేతలు.. అంతే ఘాటుగా బదులిచ్చారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధమే నడిచిందిఅశ్విని వైష్ణవ్‌ని కలిసిన రేవంత్, కిషన్ అయితే మెట్రో రైల్ పెండింగ్ అంశాలకు సంబంధించి చొరవ తీసుకోవాలని కోరుతూ.. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖరాశారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈనెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలోనే ఉంటాననీ.. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ లేఖకు స్పందించిన కిషన్‌రెడ్డి.. సీఎం కోరినట్టుగా కేంద్రమంత్రితో మీటింగ్ ఏర్పాటు చేయించారు. ఇద్దరు నేతలు కలిసి.. అశ్విని వైష్ణవ్‌ని కలిసి.. మెట్రో అంశంపై చర్చించారు. చర్చలు సానుకూలంగా ఉన్నాయని, త్వరలో సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సీఎం రేవంత్ రడ్డి ధీమా వ్యక్తం చేశారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా డైలాగ్ వార్‌కు కారణమవుతున్న మెట్రో అంశంలో ఇద్దరు అగ్రనేతలు కలిసి ముందుకు రావడం ఆసక్తిరేపుతోంది రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం భేటీ ఇక ఢిల్లీ పర్యటనలో భాగంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోనూ సీఎం రేవంత్ భేటీ అయ్యారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూసేకరణ, యుటిలిటీస్ బదలాయింపు లాంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర మంత్రికి తెలిపారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి



అనంతరం జగనాధపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని అన్నారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికా బద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాల ను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని సభా ప్రాంగణం వద్ద మరియు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండి వరుణ్ రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబర్తి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు టిప్పర్ ఢీకొని భూపాలపల్లి డీటీఓ వెంకన్న దుర్మరణం!

ప్రభుత్వ విధుల్లో భాగంగా రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి (ఇూ) బి. వెంకన్న (45) ను ఒక బొగ్గు టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటన జిల్లా అధికార యంత్రాంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వివరాల్లోకి వెళితే... గణపురం మండలం చెల్పూర్ శివారులోని ప్రాంతీయ రవాణా శాఖ (ను్ూ) కార్యాలయం ఎదుట, ఆర్టీవో ఆఫీస్ సమీపంలో డీటీఓ వెంకన్న తన సిబ్బందితో కలిసి ఉదయం రెగ్యులర్ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల నుండి బొగ్గు లోడ్‌తో పరకాల వైపు అతివేగంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ అదుపుతప్పి.. వెనుక నుంచి నేరుగా వెంకన్నపైకి దూసుకెళ్లింది. లారీ వేగానికి డీటీఓ వెంకన్న శరీరం పూర్తిగా నుజ్జునుజ్జయి రోడ్డుపై పడిపోయింది. కళ్లెదుటే జరిగిన ఈ ఘోర ప్రమాదాన్ని చూసి తోటి రవాణా శాఖ సిబ్బంది, స్థానికులు తీవ్ర షాక్‌కు లోనయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన వెంకన్న. గతంలో జగిత్యాల జిల్లాలో పనిచేశారు. అక్కడి నుండి కేవలం 15 నుండి 20 రోజుల క్రితమే ఆయన భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చి డీటీఓగా బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన కొన్ని రోజుల్లోనే ఆయన ఇలా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం ఆ కుటుంబంలో కోలుకోలేని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

## డీటీవో వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది. వెంకన్న మృతి పట్ల సంతాపం ప్రకటించిన సీఎం.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన డీటీఓ వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామన్నారు.ప్రమాదం వివరాల్లోకి వెళితే... ఈ ఉదయం గణపురం మండలం చెల్పూరు శివారులో వాహనాలను తనిఖీలు చేస్తుండగా బొగ్గు లోడ్‌తో వెళుతున్న టిప్పర్ లారీ వెంకన్నపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

## డీటీఓ వెంకన్న మృతిపై హరీశ్‌రావు అనుమానాలు!

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వాహనాల తనిఖీలు చేస్తుండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి (ఇూ) వెంకన్న దుర్మరణం చెందిన ఘటన ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ ఘోర ప్రమాదంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ రోడ్డు ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మరణం కేవలం ఒక యాక్సిడెంట్ మాత్రమే కాదనే బలమైన సందేహాన్ని హరీశ్‌రావు లేవనెత్తారు. "రాష్ట్రంలో అధికారులను బెదిరిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫియాల ఆటలు మితిమీరిపోయాయి. నిజాయతీగా పనిచేసే అధికారులు వారి అక్రమాలకు అడ్డొస్తే... ఇలా లారీలతో తొక్కించి ప్రాణాలు తీస్తారా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. భూపాలపల్లి ఏరియాలో సాగుతున్న అక్రమ ఇసుక, బొగ్గు రవాణా వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరు? వారికి సహకరిస్తున్న లీడర్స్ ఎవరు? అనే పూర్తి వివరాలను ప్రభుత్వం తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వెంకన్న ప్రమాదం వెనుక దాగిన నిజాన్ని పూర్తిగా వెలికితీయాల్సిన బాధ్యత ముమ్మాటికీ రాష్ట్ర సర్కార్ పైనే ఉందన్నారు. కేవలం డ్రైవర్‌ను అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటే కుదరదని... ఈ కేసుపై ఒక ఉన్నత స్థాయి సమగ్ర విచారణ జరిపించి, దీని వెనుక ఎవరి ప్రేరేపణ అయినా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేయాలన్నారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించడంతో పాటు, భవిష్యత్తులో విధుల్లో ఉండే అధికారులకు ఇలాంటి దారుణాలు జరగకుండా పకడ్బందీ రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి..

సోమవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

-ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలి
-అవినీతి, ఉద్దేశపూర్వక జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదు
-ఫీల్డ్ సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
-99 రోజుల ప్రగతి కార్యక్రమ వివరాలను నాణ్యతతో సమర్పించాలి
-జిల్లా అధికారులతో పరిపాలనా అంశాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,ప్రతినిధి జూన్ 22 ( తెలంగాణ పత్రిక )

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,అదనపు కలెక్టర్లు జె. అరుణ శ్రీ, కొప్పుల వెంకట్ రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో పరిపాలనా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు, వినతిపత్రాల పరిష్కారం పై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించి తప్పనిసరిగా సమాధానం అందించాలని ఆదేశించారు. పారదర్శకత, జవాబుదారీతనం ప్రతి అధికారిలో ఉండాలని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వచ్చే దరఖాస్తులకు కూడా నిర్ణీత సమయంలో సమాధానాలు అందించాలని సూచించారు.జిల్లా పరిపాలనలోని అధికారులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని, అన్ని శాఖలు తమ పరిధిలోని ఫీల్డ్ సిబ్బంది హాజరు, పని తీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా ప్రజలకు అందేలా శాఖాధిపతులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.కొన్ని శాఖల్లో ఫైళ్ల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖాధికారి తమ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్రమం తప్పకుండా సమీక్షించి, ఉద్దేశపూర్వక జాప్యాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. కొంతమంది ఫీల్డ్ సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, హానరేరియం సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని, సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కార్యాలయ భవనాల నిర్వహణతో పాటు కార్యాలయ ఆవరణ, ముందుభాగంలోని ఖాళీ స్థలాలను కూడా పరిశుభ్రంగా ఉంచడం సంబంధిత శాఖల బాధ్యతేనని తెలిపారు. త్వరలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు తమకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా, నాణ్యతతో కూడిన సమాచారంగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. సమర్పించే నివేదికలు వాస్తవాధారితంగా, సమగ్రంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

-ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





పెద్దపల్లి,ప్రతినిధి జూన్ 22 ( తెలంగాణ పత్రిక )

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, డిఆర్ఓ రాజేశ్వరి లతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన నోముల రాజేశ్వర్ రెడ్డి తమ ఇంటిని ఆన్లైన్లో నమోదు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ పేరు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రామగుండం గౌతమినగర్ కు చెందిన డి కాశయ్య మల్కాపురం గ్రామంలో సర్వేనెంబర్ 125/3 లో గల 20 ఎకరాల భూమి గతంలో ఎక్స్ సర్వీస్ మెన్ కోసం 1981 లో కేటాయించడం జరిగిందని , దీనిలో ఎటువంటి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వరాదని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన వేముల నర్సమ్మ సర్వే నెంబర్ 474/1 లో ఎకరం భూమి ఉందని , తన భూమిని కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని, తన భూమి జోలికి ఎవరు రాకుండా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఓదెల కు రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.గోదావరిఖని సూర్య నగర్ కు చెందిన ఆర్. రాధ తన కుమారుడికి ప్రభుత్వ విద్యా సంస్థలోని హాస్టల్లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి

-బీజేపీ కిసాన్ మోర్చా డిమాండ్



కొత్తగూడెం, జూన్ 22 (తెలంగాణ పత్రిక):

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్ మాట్లాడుతూ వానాకాలం (ఖరీఫ్) సీజన్-2026 ప్రారంభమై రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన వ్యవసాయ ప్రణాళికను ప్రకటించలేదని విమర్శించారు. విత్తనాల పంపిణీ నుంచి పంటల కొనుగోలు వరకు రైతులకు స్పష్టమైన విధానాన్ని తెలియజేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలి, ఎరువుల లభ్యత, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ముందస్తు కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల విక్రయాలు పెరుగుతున్నాయని, పత్తి, మిర్చి, వరి విత్తనాల పేరుతో కొందరు డీలర్లు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. అలాగే రబీ సీజన్‌కు సంబంధించిన పెండింగ్ రైతు భరోసా నిధులతో పాటు ప్రస్తుత ఖరీఫ్ రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల వరకు సంపూర్ణ రుణమాఫీ అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఎరువుల పంపిణీ విధానాన్ని సులభతరం చేసి యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చూడాలని, పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకపోతే రైతులు, ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, గొట్టిపూళ్ల దుర్గా శ్రీనివాసు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రవీందర్, సముద్రాల గాయత్రి, పాల్వంచ టౌన్ అధ్యక్షులు రాపాక రమేష్, బలగం శ్రీధర్, నవీన్, తెల్లం నరసింహారావు, నిమ్మటూరి రామారావు, బానోత్ కుమార్, గద్దం అజయ్ కుమార్, భూక్య మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనకు మద్దతుగా మొక్కలు నాటిన బిజెపి నాయకులు

ఓదెల జూన్ 22 తెలంగాణ పత్రిక

బిజెపి అగ్ర నాయకుడు నరేంద్ర మోడీ ప్రధానిగా 12 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి బిజెపి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ఆదేశాలతో మండలంలోని జీలకుంట గ్రామంలో బీరన్న ఆలయం వద్ద ఓబిసి మోర్చా పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తీగల అశోక్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ భారతదేశానికి ఒక బలమైన వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని తాను 12 సంవత్సరాలు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు ఆదేశాలతో మొక్కలు నాటడం ఎంతో సంతోషంగా ఉందని భారతదేశానికి ఒక దిక్సూచిగా ప్రధానమంత్రి పనిచేస్తున్నాడని అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయడం తథ్యమని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు చర్లపల్లి రాజు సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్ రెడ్డి మరియు స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



కొత్తగూడెం జూన్ 22 తెలంగాణ పత్రిక

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజ్ ను అన్నపురెడ్డిపల్లి మల్లికార్జున స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మల్లెల నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మల్లెల నరసింహారావు తన పెద్ద కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌కు అందజేసి, వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ, వివాహం జీవితంలో ఎంతో ముఖ్యమైన ఘట్టమని, నూతన వధూవరుల జీవితం సుఖసంతోషాలతో, పరస్పర అవగాహనతో కొనసాగాలని ఆకాంక్షించారు. మల్లెల నరసింహారావు కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మల్లికార్జున స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా మల్లెల నరసింహారావు ఆలయ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురిమల శంకర్, తూముల సదానంద, కడియాల శీను, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వివాహం కోసం ఆర్థిక సాయం అందజేత

-బిజెపి నియోజకవర్గ నాయకులు శశాంక్ ఆధ్వర్యంలో



కోటగిరి తెలంగాణ పత్రిక జూన్ 22.

కోటగిరి మండలంలోని వల్లాపూర్ గ్రామంలో బిజెపి బూత్ అధ్యక్షుడు మేకల గంగాధర్ వివాహం కోసం బాన్సువాడ నియోజకవర్గ బిజెపి నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు వేముల నవీన్ ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వరుడు గంగాధర్ కు ముందుగా వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలకు గ్రామాలలో ఉన్న పేద కుటుంబాలకు పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి పై చదువులు కొరకు వెళ్తున్న విద్యార్థిని విద్యార్థులకు కోనేరు శశాంక్ అండగా ఉంటున్నారన్నారు. బాన్సువాడ నియోజకవర్గలోని పార్టీ కార్యకర్తలకు వివాహం కోసం ఆయన వంతుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని వారి తల్లిదండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో హంసల అశోక్ వారి కుటుంబ సభ్యులు గ్రామ కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐ సనత్ కుమార్ ను కలిసిన బిజెపి నాయకులు



ఓదెల జూన్ 22 తెలంగాణ పత్రిక

పోత్కపల్లి పోలీస్ స్టేషన్కు బదిలీపై నూతనంగా వచ్చిన సనత్ కుమార్ రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి నాయకులు ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి పుల్లూరు పృథ్వీరాజ్ బిజెపి సీనియర్ నాయకులు. పులి కొమురయ్య. సదన్ కుమార్ జీలకుంట. గ్రామానికి చెందిన వార్డు మెంబర్ అగ్గి శ్రీనివాస్ గౌడ్. గొడుగు బిక్షపతి యాదవ్. భూషనవేని సత్యనారాయణ. శ్రీను తో పాటు తదితరులు పాల్గొన్నారు

# గాలివానకు రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం



-ఓదెల. జూన్ 22 తెలంగాణ పత్రిక

సోమవారం ఓదెల మండలంలోని భారీగా గాలి తో కూడిన వర్షం కురవడంతో రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షం పడింది ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది స్థానిక వివరాలకు వెళ్తే ఓదెల మండలంలోని . కనగర్తి గుండ్లపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై సోమవారం మధ్యాహ్నం భారీగా గాలితో వర్షం రావడంతో ప్రధాన రోడ్డుపై పెద్ద వృక్షం ప్రధాన రహదారిపై అడ్డంగా కూలింది ప్రయాణికులకు గంటపాటు అంతరాయం ఏర్పడింది దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధికారులు వెంటనే స్పందిస్తూ చెట్టును తొలగించే చర్యలు చేపట్టి ప్రయాణికులకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

# వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- సర్పంచ్ పగడాల



తెలంగాణ పత్రిక దమ్మపేట, జూన్ 22

వర్షాకాలంలో మురుగు కాలువల వలన ప్రజలు ఇబ్బందులు పడకుండా సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, 12వ వార్డు సభ్యురాలు దాసరోజు సరిత రామారావు సోమవారం జే.సి.బి సహాయంతో 12వార్డు పరిధిలోని వీధుల్లో చెత్త, పూడిక తీయించి మురుగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా డ్రెయిన్లు తీయించారు. వర్షాకాల వ్యాధులు మలేరియా, డెంగ్యూ ,టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, కలరా, శ్వాసకోశ అంటువ్యాధులు ఫ్లూ వంటివి కేసులు పంచాయతీ పరిధిలో నమోదు కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నాం అని సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ అంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, పూనెం పోలమ్మ, చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, ఉయ్యాల లక్ష్మీనారాయణ, చిన్నశెట్టి గోపి, పగడాల గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మండల పెరిక కుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



ఆత్మకూరు, జూన్ 22 : (తెలంగాణ పత్రిక):

ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ల శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పెరిక కుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఘటిక విజయ్ కుమార్ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు రామినేని రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నీరుకుళ్ల, పెంచికలపేట, కామారం, మల్కపేట గ్రామాల కులస్తులు పాల్గొన్నారు.దమండల అధ్యక్షుడిగా పోతరాజు రాజు, ప్రధాన కార్యదర్శిగా లక్కర్స్ లింగమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా అక్కల కుమారస్వామి, కోశాధికారిగా అంకతి సదానందం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పత్తిపాక చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఇతర పదవులకు కూడా సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సోమిశెట్టి శ్రీనివాస్, నల్లపు కోటేశ్వర్, గణేష్, శ్రీధర్ల ఈశ్వర్ కుమార్, చిట్టిబొమ్మల బిక్షపతి తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# అందరికీ కాదు కొందరికి ఉపాధి పని

-డబ్బులు లేవంటున్న టెక్నికల్ అసిస్టెంట్
-అధికారుల అండదండతో రెచ్చిపోతున్న ఫీల్డ్ అసిస్టెంట్

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (తెలంగాణ పత్రిక)

దొంగ చాటుగా ఉఫాధి పనులు క్షేత్ర సహాయకుడికి అండగా నిలుస్తున్నఅధికారులు ఊరిలో కొందరికి పని అందరికీ పని బంద్ అనిచెప్పి ...ఎవ్వరికి తెలువకుండ తనకు దగ్గరి వారితో పనులు మండలాధికారులు ఏపీవో టి ఏ లు క్షేత్ర సహాయకుడు రవితో కలిసి అవినీతికి పాల్పతున్నరని గ్రామ ప్రజలు అంటున్నారు వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లాలోని దిలావర్ పూర్ మండలం కాల్వ గ్రామంలో జరుగుతున్నటువంటి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు సాగుతున్న తీరు



పరిశీలించినట్టయితే అవకతవకలు జరుగుతున్నట్టుగా గ్రామ ప్రజలు ఆరోపించారు. గత రెండు వారాలు క్రితం పనులు నిలిపివేసి కూలీలను ఇంటికి పంపించారు .తరువాత తన అనుచరులతో కలిసి గుట్టు చప్పుడు కాకుండా పనులు దొంగచాటుగా ప్రారంభించారు .కొంతమంది పనులు ఎందుకు చేస్తున్నారని గ్రామ యువకులు నిలదీయగా పొంతనలేని సమాధానాలు చేబుతు ఇష్టం వచ్చిన వారికి చెప్పకోమని దురుసుగా ప్రవర్తించడం జరిగింది. పనులు చేయకుండా నే పోటోలు దిగుతున్నారు జనవరి 2025 నుండి జరిగినటువంటి పనుల మస్టర్ లను పరిశీలించి నట్టయితే భారి అవినీతి జరిందని ఆరోపణలు వినబడుతున్నాయి. నిర్మల్ ప్రయివేటు హస్పిటల్ లో పనిచేసేవారి పేరున కూలీడబ్బులు రావడం గ్రామంలో మామిడి తోటలో పని చేస్తున్న యువకడి పేరున డబ్బులు రావడం ఇంకా పనికి రాని అనేక మంది గృహిణుల పేర్లు కూలీ డబ్బులు వచ్చాయని గ్రామ ప్రజలు తెలిపారు. మండల అధికారుల అండతో క్షేత్ర సహాయకుడు రవి అవినీతికి పాల్పడ్డారని విచారణ జరిపి అందరిపైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు

# ఉపాధి కూలీలకు నష్టం చేసే విబి రాంజీ పథకాన్ని రద్దు చేయాలి

-కొత్త నిబంధనలతో ఉపాధి హామీ పనులకు ఆటంకం: సీఐటీయూ నేత పిట్టల అర్జున్

తెలంగాణ పత్రిక దమ్మపేట జూన్ 22

దమ్మపేట :- ఉపాధి హామీ కూలీల కొరకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబి రాంజీ పథకం ఉపాధి కూలీలకు నష్టం చేసేదిగా ఉందని, ఈ పథకానికి తీసుకువచ్చిన కొత్త నిబంధనలు ఉపాధిని హరించేవిగా ఉన్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ విమర్శించారు. సోమవారం దమ్మపేటలో ఉపాధి కూలీల సమస్యలను సీఐటీయూ ఆధ్వర్యంలో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల్లో రెండు పూటలా ఫోటో విధానాన్ని అమలు చేయడం దారుణమని అన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన ఉపాధి బకాయిలను సకాలంలో చెల్లించకుండా కొత్త నిబంధనల పేరుతో కూలీలను పనికి దూరం చేసే కుట్రను మోదీ ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. విబి రాంజీ పథకం అమలుకు ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీల్లో అధికారులు మాత్రమే ఉండడం వల్ల ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. ఈ విధానం అధికార కేంద్రీకరణకు దారితీస్తుందని, కొత్త నిబంధనలతో ఉపాధి హామీ పనులే లేకుండా పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ వ్యవస్థలో ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతాయని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉపాధి




కూలీలకు 150 రోజుల పని, రోజుకు రూ.400 వేతనం, పట్టణ ప్రాంతాలకు పథకం విస్తరణ వంటి హామీలు ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, వెంకటేశ్వరరావు, చెన్నమ్మ లక్ష్మి, లలిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక

-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

జగిత్యాల జిల్లా, తెలంగాణ పత్రిక జూన్ 22

పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యాల పెంపు అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమాన్ని అదనపు ఎస్పీతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు,ఆధునిక దర్యాప్తు పద్ధతులు,ఫోరెన్సిక్ సాంకేతికతలు,నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ డ్యూటీ మీట్ ఒక ఉత్తమ వేదికగా నిలుస్తుందని తెలిపారు.ప్రతి పోలీసు




అధికారి చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.డ్యూటీ మీట్ ద్వారా అధికారులు, సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు అనుభవాలను పంచుకోవడానికి,వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకోవడానికి అవకాశం లభిస్తుందని తెలిపారు.ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, ఫోటోగ్రఫీ,వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని,అలాగే జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు దక్కుతుందని తెలిపారు.ఈ పోటీల ద్వారా రాష్ట్రాలు,ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం,సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జూలై 6 వరకు అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,ప్రతినిధి జూన్ 22 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ఐసీడీఎస్ రామగుండం ప్రాజెక్టులో 4 పోస్టులు, ఐసీడీఎస్ పెద్దపల్లి ప్రాజెక్టులో 17 పోస్టులు, ఐసీడీఎస్ మంథని ప్రాజెక్టులో 43 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరించబడతాయని తెలిపారు. https://mis.tgwdcw.nic.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని, జూలై 6, 2026 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడించారు. అభ్యర్ధులు సంబంధిత అంగన్ వాడీ కేంద్రం ఉన్న గ్రామం లేదా మున్సి పల్ వార్డుకు చెందిన స్థానిక మహిళలై ఉండాలని,



ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. 01-07-2026 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయబడతాయని పేర్కొ న్నారు. వినికిడి యంత్రాల సహాయంతో వినగలిగే హెచ్‌హెచ్ (Hearing Handicapped) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సీ మెమో (వయస్సు ధృవీకరణ పత్రం), జనన ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం, ఇంటర్‌మీడియట్ సర్టిఫికేట్, దివ్యాంగుల సదరం సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, అనాథ ధృవీకరణ పత్రం తదితర పత్రాలను జతపరచాలని సూచించారు ప్రజావాణి లేదా కార్యాలయాల్లో నేరుగా సమర్పించిన దరఖాస్తులు స్వీకరించబడవని, ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# నిమ్షి సుచేతన్ ను ఘనంగా సన్మానించిన హరి యూనివర్సిటీ

రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 22 తెలంగాణ పత్రిక.

ఇంటర్మీడియట్ లో రాష్ట్రంలోనే రెండవ ర్యాంకును సాధించిన నింశీ సుచేతన్ ను చేగూర్ కన్హా శాంతి వనంలో ఉన్న హరి యూనివర్సిటీ ఛాన్సలర్ ఘనంగా సన్మానించారు. హరి ఉదాన్ 2026 అనే కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్తమ విద్యార్థులను గుర్తించి సన్మానించారు.
కార్యక్రమంలో నింశీ సూచేతన్ కు ఉత్తమ ప్రతిభ ధ్రువీకరణ పత్రం ఇచ్చి ప్రోత్సహించారు.
శంషాబాద్ రెహమాన్ నగర్ కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్లో పదవ తరగతిలో 10/10 సాధించి ఇంటర్మీడియట్లో 1000 మార్కులకు గాను 996 మార్కులు సాధించిన నింశీ సుచేతన్ ఇంజనీరింగ్ ఈసీఈ చదవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. తనకు ప్రోత్సాహకాన్ని అందిస్తే తెలంగాణ రాష్ట్రానికి, భారతదేశానికి మంచి పేరు తీసుకువస్తానని సందర్భంగా తెలిపారు. నింశీ సుచేతన్ తన తదుపరి చదువుల నిమిత్తం దాతలు ముందుకు వచ్చి తమ సహాయాన్ని అందించాలని కోరుతున్నాడు. ప్రభుత్వం దృష్టి పెట్టి మెరుగైన చదువుల కోసం ప్రోత్సహిస్తే ఇంకా కష్టపడి ముందుకు వెళ్తానని అన్నారు..



# ఎస్ఐగా పదోన్నతి పొందిన

-సాధిత్ హుస్సేన్ కు ఎస్పీ అభినందనలు
-పదోన్నతి మరింత బాధ్యతతో కూడిన అవకాశం
-ప్రజలకు నిబద్ధతతో సేవలందించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచన





వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 22 (తెలంగాణ పత్రిక): వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సాధిత్ హుస్సేన్ ఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆయన భుజాలపై ఎస్ఐ పదోన్నతి చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాదని, ప్రజలకు మరింత బాధ్యతాయుతంగా సేవలందించే అవకాశమని పేర్కొన్నారు. చట్ట పరిరక్షణ, శాంతి భద్రతల నిర్వహణ, ప్రజల సమస్యల పరిష్కారంలో నిబద్ధతతో పనిచేస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో ముందుకు సాగాలని, ప్రజల విశ్వాసాన్ని మరింతగా పెంపొందించేలా పనిచేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన సాధిత్ హుస్సేన్ కు జిల్లా పోలీస్ అధికారులు, సహచర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాధిత్ హుస్సేన్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా మరింత అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళాబృందం ద్వారా అవగాహన



రాయికల్ మండల జూన్ 22(తెలంగాణ పత్రిక): ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు విద్యార్థినులకు గంజాయి,ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధీర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని,ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వడంతో పాటు 1908 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని,విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యాభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు పాటలు,సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, గంగాజమున, నాగరాజు, పద్మజ, తిరుమల, వనిత, శ్రీకాంత్, గంగాధర్ , అలాగే పోలీస్ కళాబృందం సభ్యులు కమల్, ఇస్లావత్, గడ్డం రమేష్, హనుమంత్, సతీష్, సత్తయ్య, లక్ష్మణ్, కాంతయ్య , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## పూర్వ ప్రాథమిక విద్య ను సద్వినియోగం చేసుకోండి: ఎంఈవో నరేందర్





-చిన్నారుల విద్యారంభానికి శ్రీకారం:
-సర్పంచ్ సుగంధ మాధవ్ రావ్ పాటిల్

తానూర్:జూన్22 (తెలంగాణ పత్రిక) మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నరేందర్ అన్నారు. సోమవారం పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ బడుల్లో చక్కని ,సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందుతోందని సర్పంచ్ సుగంధ మాధవ్ రావ్ పాటిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఏ పి సి చైర్మన్ భోజమ్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మల్లన్న, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాచరణ్, ఉపాధ్యాయులు, ఎం పి ఓ అమీర్ ఖాన్, ఉప సర్పంచ్ పారుక్, వార్డు సభ్యులు, కార్యదర్శి,ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు , విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీలు









-నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
-సీఐ ఆర్. సంతోష్

ఆత్మకూరు, జూన్ 22 : (తెలంగాణ పత్రిక) రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆత్మకూరు సిఐ సంతోష్ తెలిపారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని అన్ని ఎరువులు, పురుగు మందుల విక్రయ కేంద్రాలను పోలీసులు , వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఎస్ఐలు తిరుపతి, లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది, వ్యవసాయ అధికారి యాదగిరి పాల్గొన్నారు. దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, లైసెన్సులు, విక్రయ రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా గడువు ముగిసిన పురుగు మందులు, గడువు ముగిసిన విత్తనాలు, కంపెనీ అనుమతి లేకుండా విక్రయిస్తున్న విత్తనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులకు అధికారులు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. గడువు ముగిసిన ఉత్పత్తులను విక్రయించడం, లేబులింగ్ లేకుండా విత్తనాలను అమ్మడం, నకిలీ లేదా నాణ్యతలేని వ్యవసాయ ఉత్పత్తులను రైతులకు విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. రైతులను మోసం చేసే విధంగా వ్యవహరిస్తే సంబంధిత దుకాణాలపై కేసులు నమోదు చేసి, లైసెన్సులు రద్దు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, ఉత్పత్తుల గడువు తేదీలను పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో నాణ్యత ప్రమాణాలు పాటించేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## సభ్యత్వం లోనే కాదు రక్తదానంలో కూడా ముందంజలో రెడ్ క్రాస్ కామారెడ్డి

-రక్తదానంతో ఆదర్శంగా నిలుస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ రెడ్డి




కామారెడ్డి, జూన్ 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి) కామారెడ్డి జిల్లా లింగాపూర్ వాటర్ చెందిన భూమని నర్సవ్వ (75) కు కాలు ఆపరేషన్ నిమిత్తమై బి నెగెటివ్ రక్తం అవసరం కావడంతో వారికి కావలసిన రక్తాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ రెడ్డి అందజేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త,ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ అత్యధిక సభ్యత్వ నమోదు లోనే కాకుండా అవసరం ఉన్నవారికి కావలసిన రక్తాన్ని అందజేయడం,తల సేమియా బాధిత చిన్నారులకు రక్తదాన శిబిరాలను నిర్వహించడం, జిల్లాకు చెందిన వ్యక్తులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏ వైద్యశాలలో ఉన్న వారికి కావలసిన రక్తాన్ని సకాలంలో అందజేస్తూ ప్రాణాలను కాపాడడం జరిగిందని,సహకరిస్తున్న రక్తదాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అశోక్ రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులను నిర్వహించడమే కాకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని అందజేసిన ఆదర్శంగా నిలుస్తున్నారని గతంలో ఎన్నో సందర్భాల్లో గర్భిణీ మహిళల కోసం,వివిధ ఆపరేషన్ల నిమిత్తమై, ప్రమాద బాధితులకు,డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తాన్ని అందజేస్తూ మానవత్వాన్ని చాటుతున్న రక్తదాతకు అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

-సోఫీనగర్ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు
-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు



నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (తెలంగాణ పత్రిక) విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి. వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం సోఫీనగర్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వసతుల విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ముచ్చటించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరమైన, పౌష్టికాహారం అందుతున్నదా లేదా అని విద్యార్థులను అడిగి నిర్ధారించుకున్నారు. చదువులో ఏవైనా సందేహాలు ఉన్నా, సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్ డానియల్, ఎం. ఈ. ఓ పద్మ, ఉపాధ్యాయులు కల్పన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు




ముథోల్:22జూన్(తెలంగాణ పత్రిక)

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఏంపీవో శివకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత సర్వే ను చేపట్టారు. లబ్దిదారులకు ఇంటి వద్దకు వెళ్లి వెరిఫికేషన్ చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. లబ్ధిదారులు వివరాలు తెలియజేయాలని కోరారు. మండలంలోని వడ్తాల్ గ్రామంలో ఇందిరమ్మ నూతనగృహ ప్రవేశాన్ని ఎంపీ ఓ శివకుమార్ ప్రారంభించారు. అనంతరం ఎంపీ ఓను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పద్మజ, సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత ,జౌళి శాఖ అసిస్టెంట్



### డైరెక్టర్‌నుకలిసిన దోమకొండ చేనేత సొసైటీచైర్మన్

కామారెడ్డి ,జూన్ 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంచైర్మన్ బత్తిని సిద్దారవములు సోమవారం చేనేత , జౌళి శాఖ సిద్దిపేట అసిస్టెంట్ డైరెక్టర్ సాగర్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, దోమకొండ పరిధిలోని చేనేత కార్మికుల సంక్షేమం, సొసైటీ బలోపేతం మరియు ముమ్మందు చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలపై అసిస్టెంట్ డైరెక్టర్ తో చైర్మన్ సుదీర్ఘంగా చర్చించారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సకాలంలో అందేలా చూడాలని, అలాగే సొసైటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా ఏడీ ని కోరారు. దీనికి అసిస్టెంట్ డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సొసైటీ పురోభివృద్ధికి మరియు చేనేత కార్మికుల సంక్షేమానికి శాఖ పరంగా ఎల్లప్పుడూ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు వైస్ చైర్మన్ గరదాస్ గంగారాములు, కార్యదర్శి కూచని జగదీశ్, కోశాధికారి కైరంకొండ శ్రీనివాస్ మరియు డైరెక్టర్ బీసుసంతోష్ పాల్గొన్నారు.

## నేడు ఏబీవీపీరాష్ట్ర వ్యాప్తంగా

### పాఠశాలలు బంద్ కి పిలుపునిచ్చింది

కామారెడ్డి, జూన్ 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బందు పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీరాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో 27000 ప్రభుత్వ పాఠశాలలో 23000 ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్రను ఆపాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడిని అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, గురుకుల పాఠశాలలకు పక్క భవనాలు నిర్మించాలని, ఎన్ ఈ పి 2020 ని వెంటనే అమలు చేయాలని ప్రైవేట్ స్కూల్ మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్,యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ కు ఏబీవీపీ పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర్ కమిటీ సభ్యులు కౌశిక్ అక్షయ్ స్వస్తిక్ వినయ్ విద్యార్థులు పాల్గొన్నారు

# అత్తను వేదిస్తున్న కోడళ్ళు

జగిత్యాల జూన్ 22 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

జగిత్యాల పట్టణానికి చెందిన కేసెట్టి అనసూర్య(85)అనే వితంతు వృద్ధురాలిని,మతిస్థిమితం లేని నా అవివాహిత కూతురును పెద్ద కోడలు,చిన్న కోడలు కొట్టుతూ, చంపుతామని బెదిరిస్తున్నారని,పెద్ద కొడుకు రాజేందర్ ఎలాంటి పోషణ, వైద్య ఖర్చులు ఇవ్వడం లేదని, మరుగుదొడ్డిని,బాత్ రూమ్ ను సైతం వినియోగించుకోకుండా పెద్ద కోడలు తాళం వేసుకుంటున్నదని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంఅతో ఆర్డీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే.వసంత కు సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.అనంతరం ఆ వృద్ధురాలు సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో విలేకరులకు తన గోడు ను రోదిస్తూ తెలిపింది.నా భర్త 20 ఏళ్ల కింద మరణించినాడని, మేము విద్యానగర్ లో కట్టుకున్న 6



గదుల్లో ఇద్దరు కొడుకులు పెద్ద కొడుకు రాజెందర్,చిన్న కొడుకు సంతోష్ లకు చెరి రెండు రూమ్ లు ఇచ్చి, మిగతా రెండు రూముల్లో నేను, నా వికలాంగురాలైన అవివాహిత కూతురు నివసిస్తుండగా, చిన్న కోడలు బలవంతంగా ఒక రూమ్ గుంజుకొని కిరాణం దుకాణం నడుపుతున్నదని, ఖాళీ చేయమంటే కొట్టుతూ, వేధింపులకు గురి చేస్తూ చంపుతామని బెదిరింపులకు గురించేస్తున్నదని, పెద్ద కోడలు మరుగుదొడ్డి, బాత్ రూమ్ కు మేము వెళ్లకుండా తాళం వేసుకుంటూ తీయమంటే కొట్టుతుందని, వారిపై చర్యలు తీసుకుంటూ పెద్ద కొడుకు, చిన్న కోడలు నుంచి పోషణ, వైద్య ఖర్చుల నిమిత్తం ప్రతి నెల రూ.10 వేలు ఇప్పించాలని ఆర్డీవో కు, జగిత్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్లకు ఫిర్యాదు చేశానని,చట్ట పరమైన న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తు రోధించింది. వృద్ధురాలి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్, వృద్ధుల సంరక్షణ కాన్సిలియేషన్ అధికారులు పి.సి.హన్మంత్ రెడ్డి, వెల్మల ప్రకాష్ రావు, సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులు ఎం.డి.యాకుబ్, గౌరి శెట్టి విశ్వ నాతం తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి

-రైతులు ఆందోళన చెందవద్దు
-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, జూన్ 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతోందన్నారు. దీనివల్ల ఎరువుల సమాన పంపిణీతో పాటు అక్రమ నిల్వలు, మళ్లింపులను అరికట్టడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు. గత వానాకాలంతో పోలిస్తే ప్రస్తుతం వరి నాట్లు నమోదైన విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ రైతులు ముందస్తుగా యూరియాను కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్



తెలిపారు. కామారెడ్డి జిల్లాలో గత ఏడాది ఇదే సమయానికి 5,571 ఎకరాల్లో వరి నాట్లు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 250 ఎకరాల్లో మాత్రమే నాట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ గత ఏడాది ఇదే తేదీ నాటికి 2.37 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేయగా, ఈ ఏడాది 2.64 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేశారని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 0.65 లక్షల యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అదనంగా అవసరమైన మేరకు నిల్వలను నిరంతరం సమకూరుస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి నర్సరీలు పెంచబడిన నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల బస్తాలకు పైగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ తగిన నిల్వలను అందుబాటులో ఉంచుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్)-2026

## ఓటరు జాబితా లో ప్రతి అర్హుడు పేరు నమోదు కావాలి

-జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, జూన్ 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ" 2026 కార్యక్రమంపై సోమవారం కామారెడ్డిజిల్లా కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా



జూన్ 25, 2026 నుంచి జూలై 24, 2026 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు గణన పత్రాలు పంపిణీ చేసి, ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఓటర్లు గణన పత్రాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌ఓలకు అందజేయ డంతో పాటు తమ వివరాలను పరిశీలించి అవసర మైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 31, 2026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అనంతరం అందిన అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుకుగా పాల్గొని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా సహకరించాలని కలెక్టర్ కోరారు. అలాగే, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు వీలైనంత త్వరగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో టీ..గిరి, తహసీల్దార్ హిమబిందు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 25 న నిర్వహించనున్న నశా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని విజయవంతం చేయాలి





-జూనియర్ కళాశాల మైదానం నుండి కలాభారతి వరకు ర్యాలీ
-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, జూన్ 22, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, ఈ నెల 25న నిర్వహించనున్న నశా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పిలుపునిచ్చారు నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జూన్ 25న కామారెడ్డి పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ సూచించారు. జూనియర్ కళాశాల మైదానం నుండి కళాభారతి వరకు ఉదయం 10.00 గంటలకు నిర్వహించే ఈ ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (తెలంగాణ పత్రిక)



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమానికి సంబంధించి జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశానికి సిద్ధంగా ఉండాలన్నారు. శాఖలవారిగా చేపట్టిన కార్యక్రమాలు, సక్సెస్ స్టోరీలు, నివేదికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి "నషా ముక్త్ భారత్ అభియాన్" గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి ప్రజావాణిలో 125 దరఖాస్తులు స్వీకరణ

-పెండింగ్ దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి

-ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

-కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,జూన్ 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాకలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మొత్తం 125 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పింఛన్లు, రెవెన్యూ తదితర అంశాలకు సంబంధించిన వినతులు ప్రజావాణిలో అందాయని , దూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రాకుండా ఆయా డివిజన్ పరిధిలో తమ అర్జీలను సమర్పించి సమస్యలను పరిష్కరించుకో వాలని అన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్ట ర్లు విక్టర్, గిరి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జెడ్పి సీఈవోచందర్, ఆర్డీవో పాండు జిల్లా స్థాయి అధికా రులు, సంబంధిత శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డే లో ప్రజాపోరాట సమితి వినతిపత్రం





వాజేడు తెలంగాణ పత్రిక జూన్ 22.

ములుగు జిల్లా వాజేడు మండలంలోని ధర్మవరం నుండి చెరుకూరు రోడ్డు నిర్మాణం చెప్పటెంత వరకు ధర్మవరం గ్రామంలో నిర్వహిస్తున్న, ఇసుక క్వారీని నిలిపివేయాలి అని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ప్రజా పోరాట సమితి అధ్యక్షులు ముత్తెబోయిన మహేందర్, మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా ఇసుక లారీల వల్లన రోడ్డు చాలా దెబ్బతిని గుంతలుమయంగా మారింది, అనేక ప్రమాదాలు, అనేక మంది మృత్యువాత పడ్డారు, అంబులెన్సులకి సైతం త్రోవ ఇవ్వని పరిస్థితులు ఏర్పడాయి అని అన్నారు. ప్రభుత్వం రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేయకుండా ప్రజల ప్రాణాలపై చిత్తశుద్ధి లేకుండా ఇసుక ర్యాంపులకి అనుమతి ఇవ్వటం చాలా బాధాకరం అన్నారు, రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేయకుండా, ఇలాంటి పరిణామలె జరిగితే భవిష్యత్ లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చెప్పడతాం అన్నారు. అనంతరం ములుగు జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి, వాజేడు మండలం పాఠశాలలో త్రాగునిటీ సదుపాయం మినరల్ వాటర్ సదుపాయం ఏర్పాటు చేయాలని,ప్రహరీ గోడలు లేక పాఠశాలలో జంతువులు ప్రవేశించి పాఠశాలలు రక్షణ లేకుండా ఉన్నాయని, అదేవిధంగా సిద్ధిలావస్థమైనా భావనలు తొలగించాలని, అదేవిధంగా ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిదాలని చెప్పడం జరిగింది, దీనిపై సానుకూలంగా స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి దీనిపై చర్యలు తీసుకుంటాను అని పాఠశాలలో ఎటువంటి సమస్యలు వచ్చిన నాకు తెలియచేయండి అని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ముత్తెబోయిన మహేందర్,గార రవికుమార్, గగ్గూరి నాగేంద్రబాబు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్షులు ఆధ్వర్యంలోకామారెడ్డికాంగ్రెస్ లోభారీ చేరికలు

కామారెడ్డి ,జూన్ 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




కామారెడ్డిడీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంఐఎం టౌన్ అధ్యక్షుడు ఇమ్రోస్ హైమద్, ముఖ్య నాయకులు" కామారెడ్డి జిల్లా కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరో కీలక ముందడుగు పడింది. కామారెడ్డి టౌన్ ఎంఐఎం అధ్యక్షుడు ఇమ్రోస్ హైమద్‌తోపాటు పలువురు ముఖ్య నాయకులు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశయాలను నెరవేర్చే పార్టీ అని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ వైపు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని, పార్టీలో చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవ పట్ల నిబద్ధతను నమ్మి పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ, రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, జూన్ 22:(తెలంగాణ పత్రిక)



ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట శివారులో జరిగింది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా...మండల పరిధి సోమ్లా తండాకు చెందిన బానోవత్ రాంసింగ్(78) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు.ఇతని చిన్న కూతురు రేణుకను టెక్మాల్ మండలం ముత్యాల బంధం తండాకు చెందిన నరేష్ కి ఇచ్చి పెళ్లి జరిపించారు.కొన్ని రోజులుగా కూతురు, అల్లుడు మధ్య సంసార విషయాల్లో గొడవలు చోటు చేసుకుంటున్నాయి.వళ్లీ గొడవ జరగడంతో రేణుక పుట్టింటికి వచ్చింది.ఆదివారం పాపన్నపేటలో అందరి సమక్షంలో రేణుకకు సముదాయించి ఆమె భర్త వద్దకు పంపేందుకు ప్రయత్నించగా రేణుకా అక్కడికి వెళ్ళేందుకు నిరాకరించింది.మనస్థాపం చెందిన రాంసింగ్ ఆదివారం రాత్రి సమయంలో పాపన్నపేట గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించి మృతుడి భార్య మీరి ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ప్లాంటేషన్ పనుల పరిశీలన

-మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉండాలి

-డిఆర్డిఏ అదనపు అధికారి లక్ష్మీ ప్రసన్న



ఆత్మకూర్, జూన్ 22: (తెలంగాణ పత్రిక):

హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లక్ష్మీ ప్రసన్న సోమవారం ఆత్మకూర్ మండలంలోని కామారం, లింగమడుగుపల్లి గ్రామాల్లో ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2026–27 సంవత్సరానికి ఆత్మకూర్ మండలానికి 66,850 మొక్కల లక్ష్యాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 46,795 మొక్కలను హోమ్‌స్టెడ్ కింద ఇళ్లకు పంపిణీ చేయనున్నట్లు, మిగిలిన 20,055 మొక్కల నాటేందుకు అవసరమైన గుంతల తవ్వకం పనులను త్వరగా పూర్తి చేసి వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం ఈజీఎస్ పథకం ద్వారా కామారం గ్రామంలో దేవేందర్‌కు చెందిన రెండున్నర ఎకరాల్లో ఏర్పాటు చేసిన మామిడి తోటను, లింగమడుగుపల్లి గ్రామంలో రాజేశ్వరరావుకు చెందిన రెండు ఎకరాల్లో నాటిన జామాయిల్ మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, ఈసీ రాము, టీఏ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ 11వ వార్షికోత్సవాలకు ముమ్మర సన్నాహాలు

-ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ.. ఈ నెల 28 నుంచి 30 వరకు వైభవంగా ఉత్సవాలు



వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 22 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ 11వ వార్షికోత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం గౌడ సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 28న గ్రామదేవతలైన నల్లపోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు. 29న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక హోమం, అమ్మవారి కల్యాణ మహోత్సవం జరగనుంది. 30న శ్రీ రేణుక ఎల్లమ్మ , పుట్టెల్లమ్మ మాతలకు బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాలాచెరువు వెంక గౌడ్, జగ్గా శంకర్ గౌడ్, నాలా చెరువు శేఖర్ గౌడ్, కోదండ కృష్ణ గౌడ్, అంగడిపేట బిక్షపతి గౌడ్ పెద్ద, నాలాచెరువు కిష్టా గౌడ్, జగ్గా అశోక్ గౌడ్, హనుమాద్రి బాలా గౌడ్, అంగడిపేట శ్రీనివాస్ గౌడ్, శాకారం శ్రీనివాస్ గౌడ్, నాలా చెరువు శ్రీనివాస్ గౌడ్ మరియు గౌడ సంఘం నాయకులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నంగునూరు, జూన్ 22(తెలంగాణ పత్రిక):

విద్యుత్ తీగలు, సబ్ స్టేషన్ మరమ్మత్తు చేసే పనులు ఉన్నందున ఈ నెల 23 వ తేదీన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాలపేట, ముంద్రాయి, తిమ్మాయిపల్లి, కోనాయిపల్లి, సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో సిద్దిపేట పట్టణ సబ్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ గ్రామాలలోని విద్యుత్ ఫీడర్లపై ఎల్సీ తీసుకుంటున్నందున మంగళవారం ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 12.00 వరకు 33కేవీ రాజగోపాలపేట ఫీడర్ పైన ఎల్సీ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అందరూ సహకరించాలని కోరారు.

# విమర్శలకు చేసిన అభివృద్ధి పనులతో సమాధానం చెప్తా

-రాయికల్ మండలం ఇటిక్యాల చింతలూరు గ్రామంలో 68 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులను పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

-ఎమ్మెల్యే మాట్లాడుతూ...



జగిత్యాల జూన్ 22 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

200 కోట్ల రోడ్లు మంజూరుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు..
హామ్ స్కీమ్ లో నూతన రోడ్లు మంజూరు అయ్యాయి.
రాయికల్ మండలానికి హామ్ లో రోడ్లు మంజూరు అయ్యాయి.
2 కోట్ల 30 లక్షల ఈజీఎస్ రోడ్లు మంజూరు అయ్యాయి..
హామ్ స్కీమ్ లో ఉప్పు మడుగు
లింగపూర్ ధవన్ పల్లె,జగిత్యాల కండ్లపల్లి కిష్టం పేట రోడ్డు మూటపల్లి కొత్త పేట డబల్ రోడ్డు
కొత్త పేట లింగాపూర్ వయా వడ్డెర కాలని,మూటపల్లి కొత్త పేట డబల్ రోడ్డు లింగాపూర్ తాట్లవాయి డబల్ రోడ్డు మంజూరు అయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం అవుతాయి అన్నారు.
హామ్ రోడ్లు 15 సంవత్సరాలు కాంట్రాక్టర్ మెయింటెనెన్స్ చేస్తారు..
రాయికల్ మండలం లో దాదాపు అన్ని రోడ్లు పూర్తి చేస్తాం..
ఈ కార్యక్రమంలో మండల గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పాపన్నపేట చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా కొడపాక విట్టల్



పాపన్నపేట,జూన్ 22:(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన పాపన్నపేట చేనేత సహకార సంఘం సంఘానికి సోమవారం రోజు ఎన్నికలు నిర్వహించించినట్లు ఎన్నికల అధికారి,జిల్లా సహకార అధికారి కార్యాలయం (మెదక్) టి.ఉమాశంకర్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.అధ్యక్షులుగా కొడపాక విట్టల్, ఉపాధ్యక్షులుగా పల్లె సంగమేశ్వర,కోశాధికారిగా అచుకట్ల గురునాథం, కార్యదర్శిగా కొడపాక వెంకటేశం, డైరెక్టర్ లుగా దాసరి యాదయ్య, చామంతుల మల్లయ్యా, చింతకుంట రంగయ్య,పల్లె లక్ష్మణ్,కొడపాక సావిత్రి లు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ విట్టల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టినందుకు చేనేత కుల సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.అన్ని విధాలుగా సంఘాన్ని,సంఘం సభ్యులను అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

-చారకొండ ఎస్సై వీరబాబు

22 జూన్ తెలంగాణ పత్రిక చారకొండ:



సోమవారం రోజున చారకొండ మండల కేంద్రంలో కేజీబీవీ లో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టం పై విద్యార్థులకు వివరించారు.డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని చారకొండ ఎస్సై వీరబాబు అన్నారు . డ్రగ్స్ రహిత సమాజంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అన్నారు. ఈ నెల 26 వరకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మంజుల , పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించాలి








-కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 22

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియపై పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో భాగంగా ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎంటీలు, బీఎల్వో సూపర్వైజర్లు, ఏఎల్ఎంటీలు, మండల ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, అవసరమైన వివరాలను సేకరించి బీఎల్వో యాప్లో నమోదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులు ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లారా, మరణించారా, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరు నమోదై ఉన్నారా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలను నిబంధనల మేరకు నిర్వహించాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా సేకరించిన సమాచారమే తుది ఓటరు జాబితా రూపకల్పనకు ప్రామాణికంగా ఉండనున్నందున ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన వ్యక్తి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఫారం-6 ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండాలని, ఉద్దేశపూర్వకంగా రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటరు నమోదు చేసుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అటువంటి సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీని ఇతరులకు తెలియజేయరాదని, అలా చేయడం కూడా నేరంగా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ మాట్లాడుతూ , ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. బీఎల్వోలు ఇంటింటి సర్వేలో సేకరించే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. బీఎల్వో యాప్లో వివరాలను సకాలంలో నమోదు చేసి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా కృషి చేయాలని సూచించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ , ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క అర్హ ఓటరు కూడా మిగిలిపోకుండా చూడాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖుల ఓటరు వివరాల ధృవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ సర్వే నిర్వహించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, శిక్షణలో వివరించిన అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్ ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల నిర్వహణ, బీఎల్వో యాప్ వినియోగం, ఓటరు మ్యాపింగ్, ఫారాల పరిశీలన, డేటా నమోదు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎంటీలు, బీఎల్వో సూపర్వైజర్లు, ఏఎల్ఎంటీలు, మండల ఆపరేటర్లు, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు వద్దు నాన్న... జీవితాలు చిత్తుఅవుతాయి కన్నా

-మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుండాలి

-పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్

పాపన్నపేట,జూన్ 22:(తెలంగాణ పత్రిక):

మాదక ద్రవ్యాలు,మత్తు క్షణిక ఆనందాన్ని ఇచ్చినా, జీవితాలను చిత్తు చేస్తుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవితాన్నిగడపాలని పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పిలుపు నిచ్చారు. సోమవారం పాపన్నపేట జూనియర్ కళాశాలలో స్థానిక తహసీల్దార్ సతీష్ తో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల బారిన పడితే




విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతా యని అన్నారు. సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువతే చైతన్య వంతులుగా మారి ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. మత్తు పదార్థాల కు బానిస కావడం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు నేరప్రవృత్తులు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిం చారు."మత్తు వద్దు నాన్న... జీవితంచి త్తవుతుంది కన్న" అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరం గా ఉంటూ,వాటి నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ప్రతిజ్ఞ చేయించా రు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధచూపాలని, అనుమా నాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీ సులకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించా రు.మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమ ంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమీషనర్ సృజన కు వినతిపత్రం అందజేసిన బేరి రామ్ చందర్ యాదవ్

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేలింగంపల్లి నియోజకవర్గం జూన్ 22.

సైబరాబాద్ మున్సిపల్ కమీషనర్ సృజన కు నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై నేతాజీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బేరీ రాశీచందర్ యాదవ్ మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం రోజు వినతి పత్రం అందజేశారు. నల్లగండ్ల చెరువు నుండి 33 ఫీట్ల నాలా నిర్మాణం జరుగుతుందనీ, నేతాజీ నగర్ కాలనీలో పేద మధ్యతరగతి కుటుంబాలు జీవిస్తున్నారనీ తెలిపారు. నేతాజీ నగర్ రెండు రోడ్లు 33 ఫీట్ల నాలా వెడల్పు కార్యక్రమంలో భాగంగా రోడ్లు 33 ఫీట్లు నాలా వెడల్పులు రోడ్లు పోతున్నాయనీ, దాంతో కాలనీ ప్రజలకు ఇబ్బంది






కలుగుతుంది, కాబట్టి నాలా కొద్దిగా అటు జరుపుకొని నిర్మించాలని కోరారు. మరి కాలనీలో మురుగునీరు నిలబడి వాసన వెదజల్లుతోందనీ, దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు 33 ఫీట్ల నాలాకి ఈ ఔట్లెట్ ఇవ్వాల్సిందిగా కోరుతూ అండర్ గ్రౌండ్ డ్రైనింగ్ వేయాలన్నారు. కాలనీలోని ప్రధానమైన రోడ్లు సిసి రోడ్లు వేయాలని దాదాపు 3000 మంది పేద మధ్య తరగతి వాళ్ళు నివసిస్తున్నారు కాబట్టి చిన్నపిల్లలకు వృద్ధులకు పార్కు స్థలము లేదు కాబట్టి పార్కును అభివృద్ధి చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ పైన విషయాలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది కమిషనర్ సానుకూలన స్పందిస్తూ త్వరలోనే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్,నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రసాద్, రాజు, గణేష్, మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

# డ్రగ్స్ వద్దు - చదువు ముద్దు: ఎస్సై అశోక్

ఇల్లంతకుంట జూన్ 22 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్పేట్ గ్రామంలోని టీజీఎంఎస్ ఆదర్శ పాఠశాలలో డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై సిరిసిల్ల అశోక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.డ్రగ్స్ వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలను ఎస్సై వివరించారు. 16 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు, యువత ఎక్కువగా డ్రగ్స్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు డ్రగ్స్కు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. చుట్టుపక్కల ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానం వస్తే



టోల్ ఫ్రీ నంబర్ 1908కి కాల్ చేయాలని, మెయిల్ ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. చివరగా డ్రగ్స్ నివారణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ



చేయించారు.ఈ కార్యక్రమంలో రహీంఖాన్పేట్ సర్పంచ్, వార్డు మెంబర్లు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సన్న రకాల వరి సాగుకు ప్రోత్సాహం రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటు

-43 రైతు వేదికల వద్ద విత్తన మేళాల నిర్వహణ
-జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 22

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సన్న రకాల వరి సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందేందుకు, నాణ్యమైన విత్తనాలు ఎరువులను అందుబాటులో ఉంచేందుకు జిల్లాలోని 43 రైతు వేదికల వద్ద మంగళవారం నుండి ఈ నెల 29వ తేదీ వరకు విత్తన మేళా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన సన్న రకాల వరి విత్తనాలు అయిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-7715, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-1638 రకాల సాగు ద్వారా రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు బహిరంగ మార్కెట్‌లో మెరుగైన ధరలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు సన్న రకాల వరి సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విత్తన మేళా కార్యక్రమంలో భాగంగా పప్పుధాన్యాలు, కూరగాయల పంటలకు సంబంధించిన మేలు రకం విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ, యూరియా తదితర వ్యవసాయ ఉత్పాదకాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతు వేదికల వద్ద సహకార సంఘాలు, తెలంగాణ సీడ్స్ సంస్థ, గుర్తింపు పొందిన విత్తన విక్రయ డీలర్లు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందజేయనున్నట్లు తెలిపారు . జిల్లాలో బీపీటీ-5204 విత్తనాలు 17,509 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్-15048 విత్తనాలు 3,118 క్వింటాళ్లు, హెచ్ఎంటీ సోనా 1,913 క్వింటాళ్లు, జై శ్రీరామ్ 2,599 క్వింటాళ్లు, కేఎన్ఎం-7715 విత్తనాలు 327.5 క్వింటాళ్లు, డబ్ల్యూజీఎల్-44 విత్తనాలు 4,052.3 క్వింటాళ్లు, కేఎన్ఎం-1638 విత్తనాలు 3,200 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే నానో యూరియా 2,165.5 లీటర్లు, నానో డీఏపీ 1,664 లీటర్లు, యూరియా 16,000 మెట్రిక్ టన్నులు జిల్లాలో సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.జిల్లాలోని రైతులందరూ తమ సమీప రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి లబ్ధి పొందాలని కోరారు. మరిన్ని వివరాల కోసం వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# ఉద్యోగుల సిఎంపిఎఫ్ పెన్షన్ క్లెయిమ్స్ ను త్వరితగతిన సెటిల్మెంట్ చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 22



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన డైరెక్టర్(పా ఁ ఫైనాన్స్) గౌతమ్ పొట్రు, ఐఏఎస్ సింగరేణి ప్రధాన కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు శని వారం 4.00 గంటలకు సింగరేణి ఉద్యోగుల పెన్షన్ క్లెయిమ్ ల సెటిల్మెంట్ల పై సింగరేణి సంస్థ సంబందిత అధికారులతో సిఎంపిఎఫ్ రీజనల్ కమీషనర్లతో సింగరేణి సంస్థ డైరక్టర్(పా ఁ ఫైనాన్స్) గౌతమ్ పొట్రు, ఐఏఎస్ సింగరేణి భవన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డైరక్టర్(పా ఁ ఫైనాన్స్ ) గౌతమ్ పొట్రు, ఐఏఎస్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందే ఉద్యోగుల సిఎంపిఎఫ్ పెన్షన్ క్లెయిమ్స్ సెటిల్మెంట్ విషయం లో ఎటువంటి జాప్యం లేకుండా సింగరేణి అధికారులు సిఎంపిఎఫ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన సెటిల్మెంట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్మిక సంక్షేమం విషయం లో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదు అని చెప్పారు.ఈ సమావేశంలో సింగరేణి భవన్ నుండి డైరక్టర్(పా ఁ ఫైనాన్స్) గౌతమ్ పొట్రు, సింగరేణి ప్రధాన కార్యలయం నుండి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఁ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఐఆర్ ఁ పిఎం కవితా నాయుడు, జిఎం(ఎఫ్ఎ) ఎన్.చక్రవర్తి, హెచ్ఓడి(ఐటి) ప్రాజెక్ట్ మేనేజర్ బి.హార ప్రసాద్, డిజిఎం(పర్సనల్) ముకుంద సత్యనారాయణ, కొత్తగూడెం గోదావరిఖని సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్లు, అధికారులు సింగరేణి అధికారులు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు

# పట్టా భూములు డి-సిల్టేషన్ పేరుతో గోదావరి ఇసుక దోపిడీ

-బిఆర్ఎస్ మంగపేట మండల మాజీ అధ్యక్షులు కుడుముల లక్ష్మీనారాయణ

మంగపేట,జూన్ 22( తెలంగాణ పత్రిక ):

మంగపేట మండలంలోని గంపోనిగూడెం గ్రామ సమీపంలో, పొదుమూరు రెవెన్యూ పరిధిలోని పట్టా భూముల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయని చూపిస్తూ, రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్, భూగర్భ జలాలు, ఇరిగేషన్ తదితర శాఖల నుంచి అనుమతులు పొంది, రాజకీయ అండదండలతో కొందరు ఇసుక కాంట్రాక్టర్లు గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు కుడుముల లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం సమీపంలోని దొంగలవారై ప్రాంతంలో నడి గోదావరిలో భారీ యంత్రాలతో ఇసుకను అక్రమంగా తవ్వి, లారీల ద్వారా తరలిస్తూ కోట్ల రూపాయల ప్రజా సంపదను దోచుకుంటున్నారు.ఈ వ్యవహారం పూర్తిగా అక్రమమని తెలిసినా, ఇసుక కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకొని అధికార పార్టీ నాయకులు ప్రేక్షకుల పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు. గోదావరి ఒడ్డునుంచి కిలోమీటర్ల మేర నదిలో రహదారి నిర్మాణం జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలో ఇదే ప్రాంతంలో గంపోనిగూడెం గిరిజన సహకార సంఘం ఇసుక క్వారీ అనుమతి కోరగా, ఈ ప్రాంతం ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ అనుమతి నిరాకరించారు అదే ప్రాంతంలో ఉన్న పట్టా భూములకు మాత్రం ఇసుక తవ్వకాల అనుమతులు ఎలా ఇచ్చారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘానికి వర్తించిన ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలు పట్టా భూములకు వర్తించవా? అధికార పార్టీ ఒత్తిడితో నిబంధనలను పక్కన పెట్టి అనుమతులు ఇచ్చారా అని ప్రశ్నించారు.



పొదుమూరు ప్రాంతం నుంచి కరకట్ట నిర్మాణం ఇప్పటికే చేపట్టబడిందని, పాత కరకట్ట నిర్మాణ అవశేషాలను తొలగించి రహదారి ఏర్పాటు చేసి ఇసుక తరలిస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గిరిజనులకు లబ్ధి చేకూరుస్తామని చెప్పుకునే ప్రభుత్వం, గిరిజన సంఘానికి అనుమతి ఇవ్వకుండా, ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఉన్న పట్టా భూములకు అనుమతులు ఇవ్వడం వెనుక కారణాలు వెల్లడించాలని కోరారు.

**డి-సిల్టేషన్ పేరుతో అక్రమాలు**

సీతమ్మ సాగర్ ప్రాజెక్టు డి-సిల్టేషన్ పేరుతో మంగపేట మండలంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, ఇది పూర్తిగా అనుమానాస్పద వ్యవహారమని పేర్కొన్నారు. ఆర్టిఐ ద్వారా ప్రభుత్వమే ఇచ్చిన సమాచార ప్రకారం మంగపేట మండలంలోని ఏ గ్రామమూ సీతమ్మ సాగర్ ప్రాజెక్టు ముంపు పరిధిలోకి రావడం లేదన్నారు. ముంపు ప్రభావం లేని ప్రాంతంలో డి-సిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఎవరి ఒత్తిడితో ఇచ్చారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటి) ఉత్తర్వుల మేరకు 24-03-2023న సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పనులు నిలిపివేయబడ్డాయని గుర్తుచేశారు.అలాంటి పరిస్థితిలో ప్రాజెక్టు పేరుతో ముంపు లేని ప్రాంతంలో డి-సిల్టేషన్ చేపట్టడం చట్టబద్ధమేనా అని ప్రశ్నించారు. ములుగు జిల్లా మంగపేట మండలాన్ని ముంపు ప్రాంతంగా ఎప్పుడు ప్రకటించారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డి-సిల్టేషన్ పేరుతో జరుగుతున్న ఈ ఇసుక తవ్వకాల ద్వారా ఎన్ని కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారో ప్రజలకు తెలుసునన్నారు.అక్రమ ఇసుక క్వారీల వెనుక ఎవరి హస్తం ఉందో అధికార పార్టీ నాయకులు బహిర్గతం చేయాలని, లేకపోతే వెంటనే క్వారీలను మూసివేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. అధికార పార్టీ నాయకులు ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.అధికారం అండగా అక్రమ అనుమతులతో గోదావరి సహజ సంపదను దోచుకునే ప్రయత్నాలకు ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం ఉందా అనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోందని కుడుముల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలొ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మల్లూర్ దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం,ములుగు జిల్లా నాయకులు పప్పు వెంకట్ రెడ్డి, నర్సింహసాగర్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు, ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నాయకులు,చల్లగురుగుల తిరుపతి, టైలర్ వెంకట్ రెడ్డి, యూత్ నాయకులు పిల్లలమర్రి వేణు, గౌని రమేష్, లక్ష్మణ్, గడ్డి సునీల్, సోషల్ మీడియా వారియర్స్, బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు,

# ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ కు 480 మంది విద్యార్థుల హాజరు

నంగునూరు, జూన్ 22(తెలంగాణ పత్రిక):

ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ కోర్సుల ప్రవ కౌన్సిలింగ్ లో భాగంగా ధ్రువపత్రాల పరిశీలన సోమవారం ప్రారంభమయింది. టీజీఈఏపిసెట్ - 2026లో పొందిన ర్యాంకుల ఆధారంగా జరిగే ప్రవేశాల కోసం నిర్వహించే ధ్రువ పత్రాల పరిశీలన రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 37 హెల్ప్ లైన్ కేంద్రాలలో కొనసాగుతోంది. దీంట్లో భాగంగా సిద్దిపేట జిల్లా రాజగోపాలపేట లోని పాలిటెక్నిక్ లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కేంద్రంలో సోమవారం ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించారు. సోమవారం 480 మంది విద్యార్థులు తమ ధ్రువ పత్రాల పరిశీలన చేయించుకున్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల ధ్రువ పత్రాలను పరిశీలించి లాగిన్ ఐడి కేటాయించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై టీజీఈఏపిసెట్-2026 లో అర్హత సాధించిన విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సులను అభ్యసించడానికి వీలుగా ఈ కౌన్సెలింగ్ ను ఈనెల 26వతేదీ వరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ లో



నిర్వహిస్తామని హెల్ప్ లైన్ కేంద్రం సమన్వయకర్త, రాజగోపాలపేట పాలిటెక్నిక్ ప్రధానాచార్యుడు అలుగోజు గోవర్ధన్ తెలిపారు. కంప్యూటర్ విభాగాధిపతి అభినవ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ సిబ్బంది రాజు, పాతూరి శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, కవిత, శ్రీనివాస్, విజయ్ కుమార్, మధుబాబు, సంతోష్ రెడ్డి, కిషోర్, వాణి, మంజుల విద్యార్థుల ధ్రువ పత్రాలను పరిశీలించారు. స్లాట్ విధానంలో నిర్వహించే ఈ కౌన్సెలింగ్ లో విద్యార్థులకు చెందిన వివిధ రకాల ధ్రువపత్రాల పరిశీలన చేసి వెబ్ ఆప్షన్స్ కు సంబంధించిన సూచనలు చేశారు. కౌన్సెలింగ్ లో 480 మంది విద్యార్థులు పాల్గొని ధ్రువపత్రాల పరిశీలన చేయించుకున్నారని ప్రధానాచార్యుడు గోవర్ధన్ వివరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

-కుకునూరుపల్లి మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 22 (తెలంగాణ పత్రిక):

పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి గుణాత్మక విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కుకునూరుపల్లి మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య కోరారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం తిప్పారం ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులకు సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలకు పంపించి డబ్బులను వృథా చేసుకోవద్దని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన బోధన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చీల రవి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి, వెంకటరమణ పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
-159 అర్జీల రాక





సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 22, తెలంగాణ పత్రిక

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించారు. మొత్తం 159 అర్జీలు రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ను తక్షణమే రద్దు చేయాలిని ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా

మాడ్గులపల్లి//నల్గొండ//జూన్ 22:(తెలంగాణ పత్రిక):-



తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మాడుగులపల్లి మండలం ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎమ్మార్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దీనిలో యూరియా యాప్ ను రద్దు చేయాలని అదే విధంగా పెండింగ్లో ఉన్న రైతు భరోసా ను వానకాలం రైతు భరోసానువిడుదల చేయాలని రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేయాలని కొనుగోలు చేసిన ధాన్యం బోనసు ను వెంటనే విడుదల చేయాలని అదే విధంగా కాంప్లెక్స్ ఎరువులు సొసైటీ ద్వారా ఎం ఆర్ పి ధరకు అందించాలని ఎరువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేయడం జరిగింది. గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దేవి రెడ్డి అశోక్ రెడ్డి, మండల కార్యదర్శి దేవి రెడ్డి మల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు పోల్ రాజు సీతారాం రెడ్డి, తదితరులు పాల్గొనడం జరిగింది.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.




నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (తెలంగాణ పత్రిక)

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రెండో దశ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సోమవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో ఎంపీడీవో లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెల్లో నివసించే అర్హులైన పేదలందరికీ రెండో దశలో ఇందిరమ్మ ఇండ్లను అందివ్వాలని తెలిపారు. రెండో దశలో మంజూరైన ఇండ్లు, దరఖాస్తుల పరిశీలన, అనుమతించిన ఇండ్లు, ఎంపీడీవో లాగిన్ ల నుండి కలెక్టర్ లాగిన్లకు పంపిన ఇండ్లు, తదితర వివరాలను మండలాల వారిగా ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనుమతుల ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. రోజు వారీగా సంబంధిత రిపోర్టులన్నీ తమకు అందజేస్తూ ఉండాలని వివరించారు. ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని పానీ పూరి విక్రయ కేంద్రాలపై చర్యలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 22, తెలంగాణ పత్రిక

ఆహార భద్రత నిబంధనలు పాటించని పలు పానీ పూరి విక్రయ కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ అధికారులు, ఆహార భద్రతా అధికారి సంయుక్తంగా పానీపూరి విక్రయ దుకాణాల్లో ఇటీవల తనిఖీ చేశారు.సిరిసిల్లలోని కైలాస్ పానీ పూరి, శివ్ కైలాస్ బేల్, అలాగే వేములవాడ లోని అనిల్ పానీ పూరి, శ్రీ బాలాజీ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్, సాయి చాట్ భండార్, దేవీ నారాయణ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్ లో తనిఖీ చేయగా, అపరిశుభ్రమైన పరిసరాల్లో తయారు చేసిన పానీ పూరీలు, పప్పు, పరిశుభ్రంగా లేని నీరు, ఉల్లిగడ్డలు, ఆలు గడ్డలు అధికారులు గుర్తించారు.ఆహార పదార్థాల తయారీ లో పాటించాల్సిన జాగ్రత్తలు నియమాలపై అవగాహన కల్పించారు. పని సమయంలో తప్పనిసరిగా ఆప్రాన్లు, హెయిర్ క్యాప్స్ ధరించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. సరైన ఆహార భద్రత ప్రమాణాలు పాటించని ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో నిరంతరం ఆకస్మిక తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ కామారెడ్డి ఆధ్వర్యంలో వార్డు సంస్థ

కామారెడ్డి, జూన్ 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




కామారెడ్డివశిష్ఠ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో కామారెడ్డి జిల్లాలోని వివిధ గ్రామాలకి చెందిన నిరుపేద విద్యారిని విద్యార్థులకి నోట్ బుక్స్, స్కూల్ బాగ్స్, పెన్నులు, పెన్సిల్స్, కంపెస్ బాక్సులు, స్కెచ్ పెన్స్, వాటర్ బాటిల్, ప్రోటీన్ పౌడర్ పంపిణీ చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎం జి చక్రవర్తి గౌడ్ కార్యదర్శి భగత్ సార్ , శ్రీనివాస్ , వశిష్ఠ డిగ్రీ కళాశాల కారస్పాండెంట్, కార్యదర్శి హరిస్మరణ్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలైన పిల్లలని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది అందరూ మంచి విద్యని అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకి చేరాలని చెప్పారు. అలాగే ఇంకా అవసరం ఉన్న పిల్లలకి కూడా తోచిన సహాయం అందిస్తామని చెప్పారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటూ మంచి పౌష్టిక ఆహారం అందుకుంటూ ముందుకు సాగాలని చెప్పడం జరిగింది ఆర్థికంగా వెనకబడిన పిల్లలకి బుక్స్, పౌష్టిక ఆహారం అందిస్తామని చెప్పారు.
ఈ కార్యక్రమానికి ఏఆర్టి మెడికల్ ఆఫీసర్స్ కామారెడ్డి డాక్టర్స్నేహ ,ప్రీతీ, చల్లా సుధాకర్ , వార్డ్ ఎన్జీవో మానిటరింగ్ కోఆర్డినేటర్స్ ,రాణి , రమేష్, సీసీలులు వంశీకృష్ణ, యాదగిరి, శ్రీవిద్య, నర్సింలు, నాగలక్ష్మి,ఆకాష్ పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి






-హాస్టల్, విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 22, తెలంగాణ పత్రిక

మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లిలోని సిరిసిల్ల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా వారితో మాట్లాడారు. ఈరోజు ఏ ఏ ఆహార పదార్థాలు వడ్డించారో ఆరా తీశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు వచ్చారో ఆరా తీశారు. అనంతరం వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. విద్యాలయాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

# ఉట్లపల్లి గంగమ్మ తల్లి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





-3కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన
-గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 22:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, యాదవ సంఘ నాయకులతో కలిసి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉట్లపల్లి గ్రామం నుండి గంగమ్మ తల్లి దేవస్థానం వరకు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన బిటి రోడ్డు పనులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భక్తులు, గ్రామస్థులు సౌకర్యవంతంగా దేవస్థానానికి చేరుకునేలా ఈ రహదారి నిర్మాణం ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి రాజీ లేకుండా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యాదవ సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగణన - 2027 మొదటి దశలో రాష్ట్రంలో జిల్లాకు మొదటి స్థానం

-మర్యాద పూర్వకంగా కలిసిన డోర్స్ అధికారులు
-జిల్లా కలెక్టర్ కు అధికారుల శుభాకాంక్షలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 22, తెలంగాణ పత్రిక



జనగణన -2027 లో భాగంగా మొదటి దశ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించి.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. జనగణన-2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ గృహ జాబితా, గృహాల లెక్కింపు కార్యక్రమం 2026 మే 11న ప్రారంభమై జూన్ 9వ తేదీన ముగియగా, రాష్ట్రస్థాయిలో కచ్చితత్వ వివరాల నమోదు, ప్రక్రియ సరిగా పూర్తి చేయడం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ రాజన్న సిరిసిల్ల (డోర్స్) తరఫున జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో డోర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అఫ్జల్ బేగం, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది

-అచ్చంపేట్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, ఆర్డీవో

కామారెడ్డి, జూన్ 22, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రీ-ప్రైమరీ తరగతులను కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ,ఆర్డీవో శ్రీ రవీందర్ రెడ్డి లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రీ-ప్రైమరీ తరగతి గదులను సందర్శించి చిన్నారులతో ఆప్యాయంగా మమేకమయ్యారు. అనంతరం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పలకపై అక్షరాలు దిద్దించి వారి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. బాల్య విద్య చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూపిల్లల జీవితంలో తొలి అడుగు అత్యంత కీలకమైనది. ప్రీ-ప్రైమరీ విద్య ద్వారా చిన్నారుల్లో విద్యపై ఆసక్తి, సృజనాత్మకత, విలువలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది" అని అన్నారు. ఆర్డీవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు బాల్యదశ నుంచే నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు కూడా నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమని ఈ సందర్భంగా వారు తెలిపారు. అచ్చంపేట్ గ్రామంలో ప్రారంభమైన ఈ ప్రీ-ప్రైమరీ తరగతులు గ్రామీణ ప్రాంత చిన్నారులకు నాణ్యమైన విద్యను మరింత చేరువ చేయడంతో పాటు, వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ శ్రీ సాయి భుజంగారావు , ఎంపీడీవో శ్రీ శివకుమార్ , ఎంఈఓ తిరుపతి రెడ్డి , నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజా పండరి , అచ్చంపేట్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు గ్రామస్థులు. డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో చిన్నారుల విద్యాభివృద్ధికి మరో ముందడుగు ఆర్డీవో రవీందర్ రెడ్డి సమక్షంలో ఘనంగా ప్రారంభమైన ప్రీ-ప్రైమరీ తరగతులు అక్షరాభ్యాసంతో చిన్నారుల విద్యకు శ్రీకారం చుట్టిన ప్రముఖులు

# ఇందిరమ్మ ఇండ్ల పేరిట' పైసా వసూల్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక జూన్ 22

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో పేదలకు అందించే పథకాలు కొంత మంది నేతలకు బాగా కలిసొచ్చింది. స్థానిక నాయకత్వానికి, అధికారులకు దగ్గర ఉంటూ అందిన కాడికి దండుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇంద్రమ్మ ఇళ్ల పథకాల్లో ఇలాంటి అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. ముడుపులు ముట్టజెప్పిన వారంతా ఇన్నాళ్లు తమ మనసులో దాచుకున్న విషయాన్ని ప్రస్తుతం ఒక్కొక్కరుగా బయటికి చెబుతున్నారు. ఇక మౌనంగా ఉంటే తాము నష్టపోవాల్సి వస్తుందనే భావన బాధితుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంతో, ఎంతో మంది నిరుపేదలు ఇండ్లు కట్టుకునేందుకు ముందుకు వస్తుండగా.. ఈ అవకాశాన్ని క్యాష్ చేసుకునే విధంగా అధికార పార్టీకి చెందిన కొందరు బ్రోకర్లుగా మారారని ఆరోపణలు ఉన్నాయి. ఒక్క రూపాయి కూడా లబ్ధిదారుల నుంచి లంచం రూపంలో తీసుకోవద్దని సమావేశాలలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు చెప్పినా.. వారి మాటలు డోంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరిస్తూ సీక్రెట్ గా లబ్ధిదారుల నుంచి డబ్బులు గుంజుతున్నట్లు తెలుస్తోంది.

**తక్కువలో తక్కువ దావత్ అన్నా..!**





మొదటి విడతతో పాటు, రెండో విడత కూడా ఇండ్లు ఇచ్చేందుకు సర్కార్ ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇల్లు మంజూరు చేయించి అన్నీ నేను చూసుకుంటానంటూ భరోసానిస్తూ డబ్బులు కూడా మాట్లాడుకుంటూ అడ్వాన్స్ గా కొందరు డబ్బులు తీసుకుంటున్నట్లు తెలిసింది. లబ్ధిదారులకు ఉచితంగా రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణానికి వస్తున్నాయనే అన్న భావనతో కొందరు నాయకులు కార్యకర్తలు, పొట్ట తిప్పలంటూ బ్రోకర్లుగా మారి ఒక్కో లబ్ధిదారుడి నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్న ప్రచారం గ్రామాల్లో జరుగుతోంది. అయితే ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు మూడు నాలుగు విడతల్లో డబ్బులు పడుతుండడంతో బ్రోకర్లు డబ్బులు అడిగే విషయాన్ని చాలా సీక్రెట్గా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. ఎవరికైనా ఈ విషయం బయట తెలిస్తే ఎక్కడ డబ్బులు ఆగిపోతాయో నన్న భయంతో గప్ చుప్గాగా వారు ఉండిపోతున్నారు. గృహప్రవేశాలు చేసుకున్న కొందరు లబ్ధిదారులు మొదట ఏమీ ఇవ్వ కపోవడ ంతో, తక్కువ లో తక్కు వ దావ త్ చేసుకునేందుకు అయినా ఎంతో కొంత ముట్ట జెప్పాల ని కొందరు చివరి మాటగా అడుగుతు ఒడడంతో మూడు వేల నుంచి ఐదు వేల రూపాయల వరకు లబ్ధిదారులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గంభీరా వుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఈ తరహా వసూళ్లకు దిగుతున్నారన్న ఆరోపణలు కూడా విన పడుతున్నాయి. హౌసింగ్ ఏఈ భవ్య ని వివరణ కోరగా ఇంద్రమ్మ కమిటీ సభ్యులు ఏ ఒక్కరైనా ప్రజల నుండి వరకు డబ్బులు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోబడును వారిని ఇందిరమ్మ కమిటీ నుంచి తీసివేయడం జరుగుతుందని అన్నారు

## ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి అడ్మిషన్ల పెంపే మాలక్ష్యం సర్పంచుల ఫోరం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 22, తెలంగాణ పత్రిక

ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్లు, అభివృద్ధికోసం మండలంలోని ప్రజాప్రతినిధులు అందరం కలిసి కృషి చేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారనీ, కళాశాలలో విద్యార్థులు ప్రవేశం పొందాలని, ఉచిత మెరుగైన విద్య అందిస్తున్నారనీ, చక్కగా చదువుకుని కళాశాలకు, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని,మార్కెట్ కమిటీ చైర్మన్ సబేరా బేగం అన్నారు.జూన్ 22 సోమవారం రోజున యెల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాప్రతినిధులచేత కళాశాల టాపర్సుకు సన్మాన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి అధ్యక్షత వహించి కళాశాలలోని సమస్యలు ప్రజాప్రతినిధుల ముందుంచారు. సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మాట నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతుల గురించి గ్రామ సభల్లో అవగాహన కల్పిస్తామని, లెక్చరర్లు చక్కగా బోధిస్తున్నారనీ, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని, కళాశాల అభివృద్ధికోసం అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. ఎల్లారెడ్డి పేట సర్పంచ్ ఎనగందుల నర్సయ్య మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికీ తనవంతు కృషి చేస్తానని, కళాశాలలో వాష్ ఏరియా నిర్మాణం చేస్తానని ,పాడైన మోటరు స్థానంలో కొత్త బోరు




మోటరు ఇస్తానన్నారు. బండలింగంపల్లి సర్పంచ్ బాల్రాజు నర్సాగౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని, కళాశాల సమస్యల పరిష్కారంలో ముందు ఉంటాననీ, కళాశాలలో ప్రింటర్ కోసం పదిహేను వేల రూపాయలు 15000విరాళం అందించారు. అనంతరం టాపర్సని , ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి మార్కెట్ కమిటీ చైర్మన్ సబేరా బేగం, వైఎస్ చైర్మన్ రాంరెడ్డి,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎనగందుల నర్సయ్య, సర్పంచులు బాలరాజు నర్సాగౌడ్, కల్లూరి, బాపురెడ్డి, కొండా రమేష్, మామిడి కిషన్, అందె సుభాష్ ,మేడిశెట్టి పద్మా బాలయ్య,డైరెక్టర్ మెండె శ్రీనివాస్,నాయకులు షేక్ గౌస్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బొంపల్లి లింగుపల్లి గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించండి

కామారెడ్డి, జూన్ 22, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం భూంపల్లి లింగంపల్లి గ్రామాల వద్ద బస్సులు ఆపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ తో కలిసి మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు సోమవారం కామారెడ్డి డిపో మేనేజర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. గాంధారి-లింగంపల్లి భూంపల్లి- కామారెడ్డి వరకు ఆర్టిసి బస్సు నడపాలని ఆర్టీసీ డిఎం కోరారు ఆయన స్థానిక స్థానికంగా స్పందించి గాంధారి నుండి లింగంపల్లి భూంపల్లి కామారెడ్డి వరకు ఆర్టీసీ బస్సు నడిచే



విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చాడు. ఫ్రీ బస్సు లు అందుబాటులోకి వచ్చిన తర్వాత కామారెడ్డి బాన్సువాడ మధ్యలో ఎక్స్ ప్రెస్ బస్సులు ఎక్కువగా నడపడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని. ఆర్డినరీ బస్సులు నడిపి భూంపల్లి. లింగంపల్లి. జనగాం. గ్రామాల ప్రజలకు అటు బాన్సువాడ ఇటు కామారెడ్డికి ప్రయాణికులు వెళ్లడానికి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి నుండి బాన్సువాడ కు గతంలో 10 ఆర్డినరీ బస్సులు నడిచే యని ప్రస్తుతం నాలుగు మాత్రమే నడుపుతూ మిగతా ఎక్స్ప్రెస్ బస్సులు నడిపి ప్రజల ఇబ్బందులు పాలు చేస్తున్నారని డిఎం దృష్టికి తెచ్చారు. కొత్త బస్సులు వస్తే ఆ రూట్ లో ఆర్డినరీ బస్సు సౌకర్యం కల్పిస్తామ ని డిపో మేనేజర్ దినేష్ అన్నారు. వీరితోపాటు డిపో మేనేజర్ కలిసిన వారిలో విట్టల్ రావు దత్తురావు కిషన్ రావు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు

కామారెడ్డి ,జూన్ 22, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరై గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ ఎస్హెచ్జీ మహిళా శక్తి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గొల్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధికి అంకితమై ఉన్నాయని తెలిపారు. గ్రామస్థులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్మోహన్ రావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు మహిళా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ



గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తానూర్ మండలం లో ఈదురు గాలుల బీభత్సం




తానూర్:జూన్22(తెలంగాణ పత్రిక)

మండలంలోని పలు గ్రామాలల్లో సోమవారం ఈదురు గాలులతో బీభత్సం నెలకొంది. ఉమ్రి గ్రామంలో రహదారికి అడ్డంగా చెట్టు విరిగి పడిపోయింది. వర్షం కొద్దిసేపు కురిసిన ఈదురు గాలులతో ఇళ్ల వద్ద ఉన్న చెట్లు నేలకరిగాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానికులు దానిని రహదారిపై నుంచి తొలగించారు.

## అక్షరాలతో విద్య వ్యాపారం చేస్తున్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలపై ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం

-పుస్తకాలు, బ్యాగులు విక్రయిస్తున్న గదిని సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులన్న
-పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్న




సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 22, తెలంగాణ పత్రిక

సిరిసిల్ల పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రైవేట్ పాఠశాలలో అనుమతులు లేకుండా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నారని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలో పుస్తకాలు, బ్యాగులు విక్రయించడం, అధిక ఫీజులు వసూలు చేయడం వంటి చర్యలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, ఆటస్థలం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ విద్యా వ్యాపారం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలకు సంబంధించిన అన్ని అనుమతుల వివరాలను ఎంఈఓ, డీఈఓ అధికారులు వెల్లడించాలని కోరారు.ఏఐఎస్ఎఫ్ ఫిర్యాదు మేరకు విద్యాశాఖ అధికారులు పాఠశాలలో తనిఖీలు నిర్వహించి పుస్తకాలు, బ్యాగులు విక్రయిస్తున్న గదిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్, జిల్లా నాయకులు పిణికాషి నాగరాజు, సాంకే వంశీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో 23 ఫిర్యాదుల స్వీకరణ :అదనపు ఎస్పీ చంద్రయ్య



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 22, తెలంగాణ పత్రిక

జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులను అదనపు ఎస్పీ చంద్రయ్య స్వీకరించారు. ఈసందర్భంగా సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ బాధితుల సమస్యలను చట్టపరంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ ఆదేశించారు.అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్



# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా

తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ 100 స్థానాల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల దొంగతనంతో పాటు సీట్ల దొంగతనానికి కూడా బీజేపీ పాల్పడుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.

# అమెరికాలో తెలంగాణ విద్యార్థి ఆకస్మిక మృతి

ఉన్నత చదువులు చదివి, బంగారు భవిష్యత్తును వెతుక్కుంటూ అమెరికా వెళ్లిన తెలంగాణకు చెందిన మరో యువ విద్యార్థి అక్కడ అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయాడు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయిరెడ్డి బొల్లెందుల.. ఫ్లోరిడాలో ఆకస్మికంగా సంభవించిన తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశాడు. ఈ విషాద వార్తతో ఆయన స్వగ్రామంలో ఒక్కసారిగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. అరుణ్ సాయిరెడ్డి హయ్యర్ స్టడీస్ కోసం యూఎస్ వెళ్లాడు. అక్కడ చదువు విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత.. ప్రస్తుతం ఫ్లోరిడా రాష్ట్రంలోని టెంపా నగరంలో నివసిస్తున్నాడు. అక్కడ స్టెమ్ ఓపీటీ (గుజువీ గ్రా) కింద ఒక కంపెనీలో ప్రాక్టికల్ ట్రైనింగ్ పొందుతూ లైఫ్‌లో సెటిల్ అయ్యే ప్రాసెస్‌లో ఉన్నాడు. ఈ నెల 19వ తేదీ వరకు స్నేహితులతో ఎంతో యాక్టివ్‌గా, హెల్తీగా గడిపిన అరుణ్ సాయిరెడ్డి.. ఆ తర్వాత ఉన్నట్లుండి తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యాడు. రూమ్‌మేట్స్, ఫ్రెండ్స్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా అతడిని స్థానికంగా ఉన్న ఒక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డులో చేర్చుకున్న డాక్టర్ల బృందం అరుణ్‌ను కాపాడేందుకు అత్యవసర చికిత్స అందించింది. కానీ అప్పటికే పరిస్థితి పూర్తిగా విషమించడంతో ఆసుపత్రిలోనే కన్నుమూశాడు. 26 ఏళ్లకే కొడుకు శాశ్వతంగా దూరమయ్యాడనే వార్త వినడంతో ఇక్కడ ఉన్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అరుణ్ డెడ్ బాడీని తెలంగాణకు రప్పించేందుకు అక్కడి ప్రవాస తెలుగు సంఘాలు లీగల్ ప్రాసెస్ ప్రారంభించాయి.

# నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదని, తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని మర్చిపోం. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను కూడా మర్చిపోం. నేను కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. పక్కా విడిచిపెట్టను" అని అన్నారు. కార్యకర్తలను వేధించిన వారు ఎక్కడున్నా వదలబోమని కేటీఆర్ హెచ్చరించారు. "రిటైరైనా, పారిపోయినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. మా కార్యకర్తలను సతాయించిన ఒక్కొక్కడినీ వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది. వదిలిపెట్టే సమస్యే లేదు. ఇది ఊరికే చెప్పడం లేదు, గుర్తు పెట్టుకోండి" అని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రజా సంక్షేమంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం



ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.సోమవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సామాజిక భవన నిర్మాణం పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి.ఎ.భాస్కర్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు,మండల తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...ప్రజా సంక్షేమానికి,రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.జైపూర్ మండల కేంద్రంలో 25 లక్షల రూపాయల 2025-26 సి.ఎస్.ఆర్. నిధులతో సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ఆఖరు గింజ వరకు కొనుగోలు చేయడం జరిగిందని, ఈ ప్రక్రియలో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, లారీలు,హమాలీల సమస్యల పరిష్కారం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని తెలిపారు.వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, రైతులు అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని తెలిపారు.యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలని,అవసరం మేరకు మాత్రమే రైతులు యూరియా కొనుగోలు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు,సన్న బియ్యం, రైతు భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తూ అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా అర్హత గల నిరుద్యోగ యువతకు మందమర్రి ప్రాంతంలో జర్మనీ భాషపై శిక్షణ అందించి విదేశాలలో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు.అర్హత గల ప్రతి నిరుద్యోగి టామ్ కామ్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.త్వరలో అటవీ శాఖ అనుమతులతో నూతన గని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో 5 వేల మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.అనంతరంలో భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 66 లక్షల సమగ్ర శిక్ష నిధులతో చేపట్టిన అదనపు వసతి గదులను మండల తహసిల్దార్ సదానందం, గ్రామ సర్పంచ్,ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు.తరగతి గదిలో చదువుకుంటూ అక్కడే పడుకోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిసి అదనపు వసతి గదుల సౌకర్యం కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చెన్నూర్,మందమర్రి లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందని,చెన్నూర్ మండలం సోమనపల్లి లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు చేపట్టడం జరిగిందని,చెన్నూర్ లోని డిగ్రీ, జూనియర్ కళాశాలలలో 3 కోట్ల 50 లక్షల రూపాయలతో పనులు చేపట్టి విద్యార్థులకు పూర్తి సౌకర్యాలతో విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదవాలని, ఉన్నత స్థాయిలో నిలిచి తల్లిదండ్రులకు సంతోషం అందించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ విద్యా సంస్థను నవీకరిస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, విద్యార్థులు చక్కగా చదివి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.పేద ప్రజలకు విద్య,వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ఆసుపత్రిని జూలై 15వ తేదీన ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మందమర్రి ప్రాంతంలో గతంలో ఉన్న 50 పడకల ఆసుపత్రిని పునః ప్రారంభించే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జైపూర్ లో సి ఎస్ ఆర్ నిధులతో సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లాలో దాదాపు 200 ఇండ్లు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, 8 వేల ఇండ్లు బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగిందని తెలిపారు.భీమారం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల సౌకర్యం కోసం అదనపు గదులు నిర్మాణం పూర్తి చేయబడి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో విద్యార్థుల నమోదు ఎక్కువగా జరుగుతుందని, పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సరం 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో వినియోగించడం జరిగిందని, ఈ సంవత్సరం ఇప్పటివరకు 16 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, దశలవారీగా మిగతా యూరియా రావడం జరుగుతుందని,యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన యూరియాను తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని దుకాణాలను ప్రతిరోజు పర్యవేక్షించడం జరుగుతుందని, రైతు వేదికలలో యూరియా సెంటర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు వ్యవసాయ సాగులో అవసరమైన మెలకువలు, సూచనలను అధికారుల ద్వారా అందించడం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకొని అధిక పంట దిగుబడి పొందాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ విద్య సంస్థలలో సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. 100 మంది కంటే విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలలలో ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లు అందజేశారు. చెన్నూర్ మండలం లింగంపల్లిలో అమ్మవారి బోనాలకు జిల్లా కలెక్టర్, జైపూర్ ఎ.సి.పి.లతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.తదనంతరం కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలో లక్ష్మీదేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన సొంత నిధుల నుండి 1 లక్ష రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం కొరకు 15 లక్షల రూపాయలు కేటాయించి భూమి పూజ చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో 2 బోర్ వెల్ ఏర్పాటుతో పాటు 2 హైమాస్ లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పారుపల్లి-కోటపల్లి రహదారి నిర్మాణానికి 10 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నిర్మించిన ఇండ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి విజన్‌ను చూసి బావ, బావమరిది జీర్ణించుకోలేకపోతున్నారు

ఈ డెవలప్‌మెంట్‌ను తట్టుకోలేకే బావ, బావమరిది ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగిన కేటీఆర్... ఇప్పుడు రాజకీయాల్లో కూడా సినిమా డైలాగులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాగా కనిపిస్తున్నాయా? పదేళ్ల మీ పాలన ఏమైనా సూపర్ హిట్టా?" అంటూ ఎంపీ ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల రూలింగ్‌లో మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని దుయ్యబట్టారు. మీ పాలన ఏమీ 'షోలే' సినిమా అంత హిట్ కాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ నేతలు... ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌ను ముంపు నుంచి కాపాడటంలో 'హైడ్రా' కీలక పాత్ర పోషిస్తోందని, నాలాల కబ్జాలను తొలగిస్తుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అలాగే మెట్రో ఫేజ్-2 ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ కూడా రాశారని గుర్తుచేశారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించి అభివృద్ధికి సహకరించాల్సింది పోయి.. చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

# హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన..

తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, నీటి నిల్వ సమస్యలను నివారించేందుకు గాను కీలక సూచనలు జారీ చేశారు. సైబరాబాద్ పరిధిలోని కంపెనీలు, ఇతర కార్యాలయాలు, విద్యాసంస్థలు సోమవారం నుంచి సాయంత్రం 3:30 గంటల నుంచే ఉద్యోగులను, విద్యార్థులను విడతల వారీగా ఇళ్లకు పంపాలని సూచించారు. భారత వాతావరణ శాఖ కథనం ప్రకారం, రాష్ట్రంలో జూన్ 27 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జూన్ 24 వరకు ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గతంలో భారీ వర్షాల కురిసిన సమయంలో గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్



సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉద్యోగులందరూ ఒకేసారి కార్యాలయాల నుంచి బయటకు రావడం వల్ల కలిగే రద్దీని నివారించేందుకే ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు నగరంలో భారీ వర్షం నమోదు కానప్పటికీ, రానున్న రోజుల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143